thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 109 | జగిత్యాల శుక్రవారం 17 జూలై, 20266 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

### టీమిండియా యువపేసర్ కు బిగ్ షాక్



11

## 5 లక్షలకు 111 ప్రశ్నల విక్రయం



- నీట్ పేపర్ లీక్‌లో సంచలన అంశాలు
- సీబీఐ దర్యాప్తులో కీలక ఆధారాలు.. కోర్టుకు నివేదిక
- కోచింగ్ సెంటర్ నిర్వాహకుడి ఫోన్‌లో లీకైన ప్రశ్నల ఆనవాళ్లు
- పరీక్షకు 10 రోజుల ముందే ప్రశ్నలు చేరినట్లు సీబీఐ వెల్లడి

4



4

## పట్టాలెక్కనున్న తొట్టతొలి హైడ్రోజన్ రైలు

నేడు జెండా ఊపి ప్రారంభించనున్న ప్రధాని మోడీ

## పార్లమెంట్ సమావేశాలకు కొత్త నిబంధనలు



- జూలై 20 నుంచి వర్షాకాల సమావేశాలు
- ఎంపీలకు లోక్‌సభ సచివాలయం మార్గదర్శకాలు జారీ

4



# సీతారామ ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేస్తాం

### భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీతమ్మసాగర్, సీతారామ ప్రాజెక్టు పనుల క్షేత్రస్థాయి పరిశీలన

- గోదావరి జలాల మళ్లింపుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేస్తామని వెల్లడి
- రీ-డిజైనింగ్ పేరుతో గత కేసీఆర్ ప్రభుత్వం 24,000 కోట్లకు అంచనాలు పెంచిందని ధ్వజం
- కమిషన్ల కక్కుర్తి వల్లే కాళేశ్వరం బ్యారేజీలు కూలిపోయాయన్న మంత్రి ఉత్తమ్
- ప్రజాధనం వృధా కాకుండా యుద్ధప్రతిపాదికన పనులు పూర్తి చేయాలని కాంగ్రెస్ నిశ్చయం

2

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చి ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సీతారామ ప్రాజెక్టు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. గురువారం అశ్వాపురం మండలంలోని సీతమ్మసాగర్, సీతారామ ప్రాజెక్టులను నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పరిశీలించిన అనంతరం గోదావరి తీరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో భట్టి మాట్లాడారు. గోదావరి జలాలను మళ్లించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. ఇటీవల దేవాదుల ప్రాజెక్టును పరిశీలించినట్లు గుర్తు చేసిన ఆయన, ఇప్పుడు సీతారామ ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షించామని చెప్పారు. గోదావరిపై నిర్మితమవుతున్న చివరి ప్రధాన ప్రాజెక్టుగా సీతారామకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు.

*- భద్రాద్రి కొత్తగూడెం, జూలై 16*

# గోల్కొండలో బోనాల వైభవం

### తొలి బోనంతో ఆషాఢ మహోత్సవాలకు శ్రీకారం

### అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు సురేఖ, పొన్నం



- డప్పుల చప్పుళ్లు.. పోతురాజుల విన్యాసాలు..
- శివసత్తుల పూనకాలతో కోటలో భక్తి వెల్లువ
- అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ ఈటల
- ప్రజలకు రేవంత్‌రెడ్డి బోనాల శుభాకాంక్షలు

2

తెలంగాణ సంస్కృతి, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి ఆలయంలో గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. సాంప్రదాయ డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల నడుమ కోట పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో విరాసిల్లాయి. ఉత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా--బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తదితర ప్రజాప్రతినిధులు ఆలయానికి చేరుకొని, సాంప్రదాయబద్ధంగా తొలి బోనం ఎత్తుకుని అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

*- హైదరాబాద్, జూలై 16 :*

## తెలంగాణ కమిటీకి చట్టబద్ధత కల్పించాలి

మంచిర్యాల, ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల ఉద్యమకారుల డిమాండ్

3



# నేడు తెలంగాణ కేబినెట్ కీలక భేటీ

సాగునీటి ప్రాజెక్టులు.. కొత్త మున్సిపల్ చట్టంపై నిర్ణయాలు

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో సమావేశం
- ప్రాజెక్టుల రీ-ఎస్టిమేషన్లు, అసెంబ్లీ బిల్లులపై చర్చ
- అభివృద్ధి, సంక్షేమ అంశాలపై కీలక నిర్ణయాలకు అవకాశం

2





### సైదాబాద్ సక్సెస్ స్కూల్‌లో ఇస్లాం బోధన

- రెండో తరగతి విద్యార్థికి మతపైరమన హోం వర్క్
- టీచర్‌ను నిలదీత..పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు
- ఘటనపై మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్

2

## కరెంట్ కోతలతో అవస్థలు

- కాంగ్రెస్ తీరువల్ల విద్యుత్ కేంద్రాల్లో పడిపోయిన ఉత్పత్తి
- నీటిని ఎత్తిపోయలేదు.. రిజర్వాయర్లు నింపలేదు
- ఇతర రాష్ట్రాలకు నాణ్యమైన బొగ్గు సరఫరా
- తెలంగాణకు తక్కువ రకం బొగ్గు ఎందుకిస్తున్నారు?
- పంట బోనస్‌ను పెద్ద బోగస్ చేశారు
- ప్రభుత్వంపై విరుచుకుపడ్డ హరీష్‌రావు

2



రాష్ట్రంలో అప్రకటిత విద్యుత్ కోతలతో రైతులు, విద్యార్థులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనికి కాంగ్రెస్ ప్రభుత్వ ముందుచూపు లేమే కారణమని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.



3

## అన్నివర్గాలను మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వం

సంక్షేమాన్ని విస్మరించి, స్కామ్‌ల్లో మునిగిన కాంగ్రెస్
హైదరాబాద్ బీఆర్ఎస్ నాయకుల సమీక్షలో కేటీఆర్

## ఇస్రోలో శాస్త్రవేత్తల మూకుమ్మడి రాజీనామాలు

అప్రమత్తం అయిన అంతరిక్ష విభాగం

రాజీనామా నిబంధనలు కఠినతరం చేస్తూ ఆదేశాలు

2





# నేడు తెలంగాణ కేబినెట్ కీలక భేటీ

**సాగునీటి ప్రాజెక్టులు.. కొత్త మున్సిపల్ చట్టంపై నిర్ణయాలు**

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో సమావేశం**

**ప్రాజెక్టుల రీ-ఎస్టిమేషన్లు, అసెంబ్లీ బిల్లులపై చర్చ**

**అభివృద్ధి, సంక్షేమ అంశాలపై కీలక నిర్ణయాలకు అవకాశం**

**హైదరాబాద్, జులై 16 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం రేపు, జులై 17న జరగనుంది. ఈ అత్యవసర సమావేశంలో పలు కీలక సాగునీటి ప్రాజెక్టుల అంచనా వ్యయాల పెంపు, రాబోయే అసెంబ్లీ బిల్లులు, నూతన మున్సిపల్ చట్టం ముసాయిదాపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశానికి ముహూర్తం ఖరారైంది. రేపు, 17వ తేదీన సచివాలయంలో కేబినెట్ అత్యవసర సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షత వహించనున్నారు. రాష్ట్రంలోని పలు కీలకమైన సాగునీటి ప్రాజెక్టుల అంచనా వ్యయాల పెంపునకు సంబంధించిన ప్రతిపాదనలపై ఈ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. దీంతోపాటు రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టబోయే బిల్లులపై కూడా కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, పెండింగ్ పనులపై ఈ కేబినెట్ భేటీలో ప్రధానంగా చర్చించనున్నారు. ముఖ్యంగా కొన్ని ప్రాజెక్టుల రీ-ఎస్టిమేషన్స్ ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపే అవకాశం ఉంది. పాలనా సంస్కరణల్లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేయబోతోంది. రాబోయే అసెంబ్లీ సభలో సరికొత్త 'మున్సిపల్ చట్టాన్ని' ప్రవేశపెట్టేందుకు రేవంత్ సర్కార్ కసరత్తు చేస్తోంది. ఈ నూతన మున్సిపల్ చట్టం ముసాయిదాపై కేబినెట్‌లో విస్తృతంగా చర్చించి, దీనికి మంత్రివర్గ ఆమోద ముద్ర వేసే ఛాన్స్ ఉంది. ఈ కీలక మార్పులతో పాటు రాష్ట్రానికి సంబంధించిన పలు ఇతర అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకోనుంది.

# సైదాబాద్ సక్సెస్ స్కూల్‌లో ఇస్లాం బోధన

**రెండో తరగతి విద్యార్థికి మతపైరమన హోం వర్క్**

**టీచర్‌ను నిలదీత..పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు**

**ఘటనపై మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్**



**హైదరాబాద్, జులై 16 :** హైదరాబాద్‌లోని సైదాబాద్ ప్రాంతంలోని సక్సెస్ స్కూల్‌లో మతపరమైన హోంవర్క్ ఇచ్చారనే ఆరోపణలు వివాదానికి దారితీశాయి. రెండో తరగతి చదువుతున్న ఓ విద్యార్థికి 'కల్మా', 'సూరహ్ ఫాతిహా' రాసి, పఠించాలని హోంవర్క్ ఇచ్చినట్లు విద్యార్థి తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ ఘటనపై తల్లిదండ్రులు స్కూల్ యాజమాన్యాన్ని ప్రశ్నించగా, ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అనంతరం పాఠశాల యాజమాన్యం స్పందించి, సంబంధిత ఉపాధ్యాయురాలు షేక్ ఆయిషా పర్వీన్‌ను విధుల నుంచి తొలగించింది. అలాగే భవిష్యత్తులో సక్సెస్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ సంస్థల్లో ఆమెకు ఉద్యోగావకాశం కల్పించబోమని తెలిపింది. ఘటనపై విద్యార్థి కుటుంబ సభ్యులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసుకు సంబంధించి న్యాయపరమైన అభిప్రాయం తీసుకుంటున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఇదే సమయంలో పాఠశాల వద్ద బీజేపీ నాయకులు నిరసన చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ పిల్లలకు మతపరమైన అంశాలను నేర్చుకోవాలని చెప్పడంపై తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేయగా, 'మా స్కూల్‌లో చదవాలంటే ఇవి నేర్చుకోవాల్సిందే' అని సదరు టీచర్ చెప్పినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై స్కూల్ యాజమాన్యం, సంబంధిత టీచర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు, బీజేపీ నాయకులు సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనపై విచారణ చేపట్టారు. కాగా, ఈ వివాదంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. హిందూ విద్యార్థికి కల్మా, సూరా ఫాతిహా చదవాలని హోమ్‌వర్క్ ఇవ్వడం దుర్మార్గమని ఆయన విమర్శించారు. స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. బలవంతంగా హిందూ సంస్కృతిపై దాడి చేస్తున్నారని మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సైదాబాద్ సక్సెస్ స్కూల్ యాజమాన్యం.. కల్మా చదవాలని విద్యార్థికి హుకుం జారీ చేయడం దుర్మార్గం అన్నారు. స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోకాల్డ్ సెక్యులర్ సంఘాలు దీనిపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. హిందూ సమాజమంతా ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. సైదాబాద్ సక్సెస్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# గోల్కొండలో బోనాల వైభవం

**తొలి బోనంతో ఆషాఢ మహోత్సవాలకు శ్రీకారం**

- డప్పుల చప్పుళ్లు.. పోతురాజుల విన్యాసాలు..
- శివసత్తుల పూనకాలతో కోటలో భక్తి వెల్లువ
- అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ ఈటల
- ప్రజలకు రేవంత్‌రెడ్డి బోనాల శుభాకాంక్షలు



**హైదరాబాద్, జూలై 16 :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల మహోత్సవాలు గురువారం గోల్కొండ శ్రీ జగదంబ మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పణతో ఘనంగా ప్రారంభమయ్యాయి. డప్పుల చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, రంగురంగుల సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు ఎత్తుకుని ఆలయానికి చేరుకోవడంతో గోల్కొండ కోట భక్తి పారవశ్యంతో మార్మోగింది. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సుమారు మూడు వేలకుపైగా దేవాలయాల్లో బోనాల ఉత్సవాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. తొలి బోనం అనంతరం నగరంలోని వివిధ మహంకాళి ఆలయాల్లో బోనాల వేడుకలు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా గోల్కొండ శ్రీ జగదంబ మహంకాళి అమ్మవారిని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొక్కులు చెల్లించి రాష్ట్ర ప్రజలకు బోనాల శుభాకాంక్షలు తెలిపారు. మీడియాతో మాట్లాడిన ఈటల రాజేందర్, బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. వందల ఏళ్లుగా కొనసాగుతున్న ఆనవాయితీ ప్రకారం కుమ్మర సమాజానికి చెందిన మహిళలు గోల్కొండ జగదంబ మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పిస్తారని తెలిపారు. అక్కడి నుంచి లష్కర్ బోనాలతో పాటు హైదరాబాద్ నగరంలోని ప్రతి గల్లీ, ప్రతి ఇంటికి ఈ వేడుకలు విస్తరిస్తాయని, అనంతరం గ్రామీణ ప్రాంతాల్లోనూ బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారని చెప్పారు. అమ్మవారిని ప్రార్థిస్తూ ప్రజలు సుఖశాంతులు, సకాలంలో వర్షాలు, పాడిపంటల సమృద్ధి, రాష్ట్ర సుభిక్షత కోసం మొక్కులు చెల్లిస్తారని ఈటల పేర్కొన్నారు. బోనాల పండుగ భావితరాలకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను అందించే మహత్తర ఉత్సవమని అన్నారు. ఇదిలా ఉండగా, బోనాల మహోత్సవాల ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. బోనాల పండుగ సామాజిక ఐక్యతకు ప్రతీక అని పేర్కొంటూ, ఈ ఏడాది ఉత్సవాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులు కేటాయించిందని గుర్తుచేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారిశుద్ధ్యం, తాగునీరు, నిరంతర విద్యుత్, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ, కట్టుదిట్టమైన భద్రత, అగ్నిమాపక సేవలతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆలయాల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి ఇప్పటికే అధికారులను ఆదేశించినట్లు వెల్లడించింది.

# సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేస్తాం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీతమ్మసాగర్, సీతారామ ప్రాజెక్టు పనుల క్షేత్రస్థాయి పరిశీలన
- గోదావరి జలాల మళ్లింపుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేస్తామని వెల్లడి



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 16 :** గోదావరిలో ప్రవహిస్తున్న జలాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలనే సంకల్పంతోనే ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గోదావరి జలాలను మళ్లించడం ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాను పూర్తి స్థాయిలో సస్యశ్యామలం చేసి రైతాంగాన్ని ఆదుకుంటామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఇటీవల దేవాదుల ప్రాజెక్టును సందర్శించామని, నేడు సీతారామ ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించామని తెలిపారు. తెలంగాణలో చివరి ప్రాజెక్టు అయిన సీతారామ ద్వారా గోదావరి నీటిని గరిష్టంగా సద్వినియోగం చేసుకుంటామని ప్రకటించారు. అశ్వాపురంలోని సీతమ్మ సాగర్, సీతారామ ప్రాజెక్టులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం పరిశీలించారు. ప్రాజెక్టు సందర్శన అనంతరం గోదావరి తీరంలో మంత్రులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గతంలో సీతారామ ప్రాజెక్ట్ స్థానంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 'దుమ్ముగూడెం రాజీవ్ సాగర్', 'రుద్రంకోట ఇందిరా సాగర్' ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి ప్రణాళికలు రూపొందించారని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. అయితే, గత కేసీఆర్ ప్రభుత్వం రీ-డిజైనింగ్ పేరుతో తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ఈ ప్రాజెక్టుల వ్యయాన్ని భారీగా పెంచిందని విమర్శించారు. రీ-డిజైనింగ్ నెపంతో ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని ఏకంగా రూ. 24,000 కోట్లకు పెంచేసి ఖజానాపై అదనపు భారం మోపారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టులపై ఇప్పటికే భారీగా నిధులు ఖర్చు చేశారని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ప్రజాధనం ఇప్పటికే అధిక మొత్తంలో వ్యయం కావడం వల్ల ఇప్పుడు ఈ ప్రాజెక్టులను నిలిపివేయడం సాధ్యం కాదని, అందుకే వీటిని ఎలాగైనా పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్న మిగిలిన పనులన్నింటినీ యుద్ధప్రతిపాదికన, అత్యంత త్వరితగతిన పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. గోదావరి జలాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు సీతారామ ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహిస్తాం. గోదావరిపై చివరి ప్రాజెక్ట్ ఇది. దీనిపై ఆర్థిక భారం పడింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దుర్మార్గంగా ఆలోచించి బడ్జెట్ పెంచి ప్రాజెక్టును రీడిజైన్ చేశారు. గోదావరిపై జరుగుతున్న అక్రమాలపై ఆనాడు శాసనసభలో, బయట కూడా గళం విప్పాం. పెద్ద ఎత్తున ఖర్చు చేసిన ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలని సీఎం రేవంత్ పట్టుదలతో ఉన్నారు. ఇప్పటివరకు ఎంతమేర పనులు పూర్తయ్యాయో చూసేందుకు ఈ పర్యటన చేపట్టాం. ప్రజా ప్రభుత్వంలో ఒక్క పైసా కూడా దుర్వినియోగం కాకుండా ప్రాజెక్టును పూర్తిచేస్తాం అని భట్టి విక్రమార్క అన్నారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో ఇరిగేషన్‌పై లక్షల కోట్లు ఖర్చు చేశారని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కమిషన్లకు కక్కుర్తి పడి నిర్మాణం చేసిన కాళేశ్వరం కూలిందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.లక్షా 80 వేల కోట్లు ఖర్చు పెట్టారని అన్నారు. గొప్పలు చెప్పుకున్న గత ప్రభుత్వం తెలంగాణకు ఎంత నష్టం చేసిందో స్పష్టంగా కనపడుతోందని అన్నారు. సీతారామసాగర్ ప్రాజెక్ట్‌ను తప్పకుండా పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాలను పారిస్తామని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో సీతారామసాగర్‌కు కనీసం ఒక్క ఎకరానికి కూడా సాగునీరు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సీతారామసాగర్ బీఆర్ఎస్ పాలనకు నిదర్శనమని అన్నారు. కాళేశ్వరానికి మూడేళ్లలో ఎలా బీటలు వచ్చాయో చూశామని చెప్పారు. మేడిగడ్డ కూడా బీఆర్ఎస్ హయాంలోనే కూలిందని విమర్శించారు. డీపీఆర్‌లో ఉన్న ఫౌండేషన్‌ను మార్చి మరో పద్ధతిలో నిర్మించారని తెలిపారు. సుందిళ్ల ప్రతిపాదిత స్థలంలో కాకుండా మరో చోట నిర్మించారని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. రైతుల నుంచి తాము వరి కొనుగోళ్లు చేసి నేరుగా అకౌంట్‌లో డబ్బులు వేశామని వెల్లడించారు. మూడు బ్యారేజీలు టెస్ట్ నడుస్తోందని.. లాజికల్‌గా తమ ప్రభుత్వం నడుచుకుంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో నాణ్యత లోపంతో బ్యారేజీలు నిర్మించారని అన్నారు. కేసీఆర్ హయాంలో లక్షల కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ప్రాజెక్ట్ కూడా సరిగా ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. ఇరిగేషన్ వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిన ఘనత కేసీఆర్ సర్కార్‌దే అని ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని ఉద్ఘాటించారు. రాష్ట్రపాలన మొత్తం ఈ జిల్లా నుంచే కొనసాగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# ఇస్రోలో శాస్త్రవేత్తల మూకుమ్మడి రాజీనామాలు

**అప్రమత్తం అయిన అంతరిక్ష విభాగం**

**రాజీనామా నిబంధనలు కఠినతరం చేస్తూ ఆదేశాలు**

**న్యూఢిల్లీ, జూలై 16 :** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రోలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలు భారీ ఎత్తున రాజీనామాలు చేస్తున్నారు. వీటిని నియంత్రించేందుకు అంతరిక్ష విభాగం డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ కీలక నిర్ణయం తీసుకుంది. కు రాజీనామాల నిబంధనలను కఠినతరం చేసింది. ఈ ఆదేశాలను అంతరిక్ష విభాగం గురువారం జారీ చేసింది. వాటిని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్, విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లతోపాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న పలు కేంద్రాలకు కూడా పంపింది. భారత్ చేపట్టిన ప్రతిష్ఠాత్మక మానవ అంతరిక్ష యాత్ర కార్యక్రమం గగన్‌యాన్‌తోపాటు ఇతర 'ముఖ్యమైన మిషన్ల'కు అనుబంధంగా పని చేస్తున్న గ్రూప్- ఏ శాస్త్రవేత్తలు, సాంకేతిక సిబ్బంది నుంచి వచ్చే రాజీనామాలు, స్వచ్ఛంద పదవీ విరమణ అభ్యర్థనలు యథావిధిగా అంగీకరించ వద్దని ఆ ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఉద్యోగుల రాజీనామాతో జాతీయ ప్రాముఖ్యత కలిగిన ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. శాస్త్రవేత్త, ఇంజనీర్ హోదా లేదా అంతకంటే తక్కువ స్థాయిలోని సాంకేతిక సిబ్బంది నుంచి స్వీకరించిన రాజీనామాలను తమకు పంపాలని సదరు కేంద్రాలకు అంతరిక్ష విభాగం స్పష్టం చేసింది. అదికూడా ఆయా కేంద్రాల్లోని డైరెక్టర్ల స్పష్టమైన సిఫార్సులతో పంపాలని కోరింది. అయితే గ్రూప్- ఏ స్థాయిలోని ఉద్యోగుల రాజీనామాలను ఆమోదించేందుకు ఈ కేంద్రాల డైరెక్టర్లకు గతంలో ఇచ్చిన ఆదేశాలను తాజాగా అంతరిక్ష విభాగం రద్దు చేసింది. ఇటీవల ఇస్రో నుంచి 100 మందికి పైగా సిబ్బంది రాజీనామా చేశారంటూ వార్తా కథనాలు వెలువడ్డాయి. అందులో బెంగళూరులోని యూఆర్ఎస్‌సి, తిరువనంతపురంలోని వీఎస్ఎస్‌సి నుంచి పెద్ద ఎత్తున శాస్త్రవేత్తలు రాజీనామాలు చేశారు. ఆ జాబితాలో ప్రముఖ శాస్త్రవేత్తలు కూడా ఉన్నారని తెలుస్తోంది. ఈ రాజీనామాలు చేసిన శాస్త్రవేత్తలు అంతా.. స్పేస్ స్టార్టప్‌లలో చేరుతున్నట్లు సమాచారం. 2020లో అంతరిక్ష రంగంలోకి ప్రవేశించేందుకు ప్రైవేట్ సంస్థలను కేంద్రం అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. 2023లో భారత అంతరిక్ష విధానాన్ని ప్రారంభించింది. నాటి నుంచి స్పేస్ స్టార్టప్‌లు దూసుకు వెళ్తున్నాయి. దేశంలో ప్రస్తుతం 400కు పైగా అంతరిక్ష స్టార్టప్‌లు ఉన్నాయి. అవి 500 మిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించాయి. 2025లో వాటికి 150 మిలియన్ డాలర్లు సమకూరాయి. పిక్సెల్, ధ్రువ స్పేస్, స్కైరూట్ ఏరోస్పేస్, అగ్నికుల్ కాస్మోస్, బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్ వంటి కంపెనీలు ఈ పోటీలో ముందున్నాయి.



# అన్నివర్గాలను మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వం

- సంక్షేమాన్ని విస్మరించి, స్కామ్‌ల్లో మునిగిన కాంగ్రెస్
- హైదరాబాద్ బీఆర్ఎస్ నాయకుల సమీక్షలో కేటీఆర్



**హైదరాబాద్, జూలై 16 :** కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందని, కేవలం సగం పదవీకాలం పూర్తికాకముందే తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న ప్రభుత్వంగా చరిత్రలో నిలిచిపోతుందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేసిన మోసకారి ప్రభుత్వంగా కాంగ్రెస్ మారిందని, అందుకే సమాజంలోని ప్రతి వర్గం ఆ ప్రభుత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆయన విమర్శించారు. ఈరోజు పార్టీ నేతలతో పాటు హైదరాబాద్ స్థానిక ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఆడబిడ్డల నుంచి అన్నదాతల వరకు, విద్యార్థుల నుంచి నిరుద్యోగ యువత వరకు ఏ ఒక్కరికీ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని కేటీఆర్ అన్నారు. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, అవినీతి, స్కామ్‌లు, అక్రమాలు, అరాచకాలనే పాలనగా మార్చుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న మాటలు, అనుసరిస్తున్న విధానాలు, సాగిస్తున్న పాలన ప్రజా కంటకంగా మారాయని విమర్శించారు. స్వయంగా ముఖ్యమంత్రి చేయించుకున్న సర్వేలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రమైన ప్రజా వ్యతిరేకత వ్యక్తమైందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ కాలం ముగిసిపోతుందనే విషయం స్పష్టమవుతున్న నేపథ్యంలోనే ముఖ్యమంత్రి అడ్డగోలుగా మాట్లాడుతూ తన అక్కసును వెళ్లగక్కుతున్నారని అన్నారు. రైతులు సాగునీటి కోసం అడుగుతుంటే, వారికి భరోసా ఇవ్వాల్సిన ముఖ్యమంత్రి "రక్తం పారిస్తా" అన్నట్లుగా మాట్లాడటం అత్యంత దురదృష్టకరమని కేటీఆర్ అన్నారు. ఒకవైపు రాష్ట్రంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో, కరువు అంచున ఉండగా, ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలు రాష్ట్ర ప్రజలందరిలో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించాయని పేర్కొన్నారు. చివరకు రైతులు కూడా "మా రక్తాన్ని తీసుకోండి... కానీ మా పొలాలకు నీళ్లు ఇవ్వండి" అని డిమాండ్ చేసే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. యువత, నిరుద్యోగుల విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం యూత్ డిక్లరేషన్ పేరిట భారీ మోసం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత ఎప్పటికప్పుడు ఆ మోసాన్ని ఎండగడుతున్నారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన డిక్లరేషన్లలోని హామీల అమలు వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు బీఆర్ఎస్ వరుసగా సభలు నిర్వహిస్తోందని తెలిపారు. వరంగల్ రైతు సభ అనంతరం, ఈ నెల 18న సరూర్‌నగర్ స్టేడియంలో యువత, విద్యార్థులతో భారీ యువజన సదస్సు నిర్వహించి కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ వైఫల్యాలను ప్రజల ముందుంచనున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. ఈ సదస్సు ఏర్పాట్లపై నగరానికి చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులతో ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నివాసంలో కేటీఆర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. యువజన సభకు కాంగ్రెస్ పార్టీ అడ్డంకులు సృష్టించే అవకాశం ఉందని, అలాంటి ప్రయత్నాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కేటీఆర్ సూచించారు. హైదరాబాద్‌తోపాటు పరిసర అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కూడా భారీ సంఖ్యలో యువత స్వచ్ఛందంగా సభకు తరలివస్తారని సీనియర్ నాయకులు కేటీఆర్‌కు వివరించారు.

# అప్రకటిత కరెంట్ కోతలతో అవస్థలు

- కాంగ్రెస్ తీరువల్ల విద్యుత్ కేంద్రాల్లో పడిపోయిన ఉత్పత్తి
- నీటిని ఎత్తిపోయలేదు.. రిజర్వాయర్లు నింపలేదు
- ఇతర రాష్ట్రాలకు నాణ్యమైన బొగ్గు సరఫరా
- తెలంగాణకు తక్కువ రకం బొగ్గు ఎందుకిస్తున్నారు?
- పంట బోనస్‌ను పెద్ద బోగస్ చేశారు
- ప్రభుత్వంపై విరుచుకుపడ్డ హరీష్‌రావు



**హైదరాబాద్, జూలై 16 :** రాష్ట్ర ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక, కనీస సోయి లేకపోవడం వల్లే తెలంగాణ మళ్లీ అంధకారంలోకి వెళ్లే పరిస్థితి వచ్చిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అప్రకటిత విద్యుత్ కోతలతో రైతులు, విద్యార్థులు, వ్యాపారులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, సత్యవతి రాథోడ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇస్తే.. నేడు 11 జిల్లాల్లో కరెంట్ కోతలకు నిరసనగా సబ్‌స్టేషన్ల ముందు రైతులు ధర్నాలు చేయాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. రాష్ట్రంలో కేవలం 15 వేల మెగావాట్ల లోడ్ మాత్రమే ఉన్నప్పటికీ, 7,180 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యమున్న ప్లాంట్లలో నిన్న కేవలం 3,190 మెగావాట్లు (44 శాతం) మాత్రమే ఉత్పత్తి జరిగిందని హరీష్‌రావు గణాంకాలతో సహా వివరించారు. కొత్తగూడెం, కాకతీయ, భద్రాద్రి, యాదాద్రి పవర్ స్టేషన్లలో వారం రోజులకు మించి బొగ్గు నిల్వలు లేవని, యాదాద్రిలో బొగ్గు లేక, భద్రాద్రిలో నిర్వహణ లోపంతో ఉత్పత్తి నిలిచిపోయిందన్నారు. సింగరేణి వెబ్‌సైట్‌ను మూసివేసి అక్రమాలను దాస్తున్నారని మండిపడ్డారు. నాణ్యమైన సింగరేణి బొగ్గును ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు తరలిస్తూ.. తెలంగాణ ప్లాంట్లకు లో-క్వాలిటీ బొగ్గు ఇస్తున్నారని, అందుకే 70 రేకులు పంపితే 30 రేకులు రిజెక్ట్ అవుతున్నాయని ఆరోపించారు. మన దగ్గర బొగ్గు ఉండి కూడా పవర్ ఎక్స్ఛేంజ్‌లో అడ్డగోలు ధరలకు 80 మిలియన్ యూనిట్ల విద్యుత్ కొంటూ ఆ భారాన్ని ప్రజలపై వేస్తున్నారని, ఈ విద్యుత్ కొనుగోళ్ల వెనుక పెద్ద స్కాం దాగి ఉందన్నారు. వ్యవసాయ రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా సంక్షోభంలోకి నెట్టేసిందని హరీష్‌రావు విమర్శించారు. సగం మందికే రుణమాఫీ చేసి చేతులు దులుపుకున్నారని, రైతు భరోసాను సీజన్ల వారీగా ఎగ్గొట్టారని, చివరకు పంట బోనస్‌ను కూడా పెద్ద బోగస్‌గా మార్చారని దుయ్యబట్టారు. లోవోల్టేజ్, మోటార్లు కాలిపోవడం వల్ల రైతులు రాత్రంతా పొలాల వద్ద జాగారం చేయాల్సి వస్తోందని, ఇందిరమ్మ పాలన అంటే ఉమ్మడి రాష్ట్రం నాటి కరెంట్ కష్టాలను మళ్లీ తేవడమేనా అని ప్రశ్నించారు. గ్రీన్ ఎనర్జీ పాలసీ కింద 3 వేల మంది పారిశ్రామికవేత్తలు దరఖాస్తు చేసుకున్నా.. కమిషన్ల కక్కుర్తి కోసమే ఫైళ్లను క్లియర్ చేయడం లేదని ఆరోపించారు. ఖమ్మం జిల్లాలో మంత్రులు నేడు ప్రారంభించిన సీతారామ ప్రాజెక్ట్ మోటార్లు కేసీఆర్ హయాంలో ఏర్పాటు చేసినవేనని, కేసీఆర్ పెట్టిన మోటార్లకు కాంగ్రెస్ మంత్రులు కేవలం స్విచ్‌లు వేయడానికి మాత్రమే వెళ్తున్నారని ఎద్దేవా చేశారు. వెంటనే థర్మల్ ఉత్పత్తిని పెంచి, రైతాంగానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హరీష్‌రావు హెచ్చరించారు.

# తెలంగాణ కమిటీకి చట్టబద్ధత కల్పించాలి



## సమీక్షల కోసం కమిటీ సభ్యులే జిల్లాలకు రావాలి

## మంచిర్యాల, ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల ఉద్యమకారుల డిమాండ్

**హైదరాబాద్,జూలై 16 :** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ గురువారం అమరవీరుల స్మారక చిహ్నంలో మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల క్షేత్రస్థాయి ఉద్యమకారులతో ముఖాముఖి సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. సమావేశంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మోతె శోభన్ రెడ్డి, ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, అద్దంకి దయాకర్, ఎస్. రాములు నాయక్ తదితరులు హాజరై ఉత్తర తెలంగాణ జిల్లాల నుండి తరలివచ్చిన పోరాటయోధుల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. స్వరాష్ట్ర సాధనలో మంచిర్యాల, ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల ఉద్యమకారులు అత్యంత కీలకమైన పాత్ర పోషించారని కొనియాడారు. సింగరేణి బొగ్గు గనుల సమ్మెల ద్వారా నాటి ప్రభుత్వ గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన మంచిర్యాల, ఆసిఫాబాద్ కార్మిక శ్రేణులు, ఉద్యమానికి ప్రధాన కేంద్రంగా నిలిచిన కరీంనగర్ పోరాట గడ్డల త్యాగాలు చారిత్రాత్మకమైనవని ప్యానల్ స్పష్టం చేసింది. ముఖాముఖి సంప్రదింపుల్లో పాల్గొన్న అత్యధిక శాతం మంది ఉద్యమకారులు సంక్షేమ పథకాల కంటే ముందే రెండు అత్యంత కీలకమైన డిమాండ్లను కమిటీ ముందు గట్టిగా లేవనెత్తారు. సుదూర ప్రాంతాలైన ఆసిఫాబాద్, మంచిర్యాల వంటి సరిహద్దు జిల్లాల నుండి వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న ఉద్యమకారులు హైదరాబాద్ దాకా రాలేకపోతున్నారని ప్రతినిధులు కమిటీ దృష్టికి తెచ్చారు. అందువల్ల, కమిటీ సభ్యులే స్వయంగా జిల్లాలకు వచ్చి క్షేత్రస్థాయిలో ఉండి నిజమైన ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియను చేపట్టాలని పట్టుబట్టారు. రెండు ప్రధాన డిమాండ్లతో పాటు, క్షేత్రస్థాయి యోధులు తమ ఇతర ఆత్మగౌరవ సంక్షేమ వినతులను కూడా కమిటీకి సమర్పించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి 250 గజాల నివాస స్థలం కేటాయించాలని,జీవన భృతి కోసం గౌరవప్రదమైన నెలవారీ పెన్షన్ అందించాలని,ఉద్యమకారుల పిల్లలకు విద్యా, ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. వీటితో పాటు మహిళా ఉద్యమకారులకు ప్రత్యేక ప్రయోజనాలు, ఉచిత కార్పొరేట్ వైద్యం కోసం హెల్త్ కార్డులు, ఉచిత నాణ్యమైన విద్య, మరియు ఆర్టీసీ బస్సులలో ఉచిత రవాణా సౌకర్యం కల్పించాల్సిందిగా వినతి పత్రాలు సమర్పించారు. ఉద్యమకారులు లేవనెత్తిన అంశాలపై కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు స్పందిస్తూ.. 'మీ ప్రతిపాదనలు వందకు వంద శాతం న్యాయమైనవి. ఈ అంశాలను సమగ్ర నివేదికలో చేర్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తక్షణమే తీసుకెళ్తామని అన్నారు. ప్రతి ఒక్క నిజమైన పోరాట యోధునికి న్యాయం జరిగేలా చూస్తాం' అని గట్టి భరోసా ఇచ్చారు. జూలై 22 వరకు ముఖాముఖి షెడ్యూల్ నిరంతరాయంగా కొనసాగుతుందని కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు ముగింపు ప్రసంగంలో స్పష్టం చేశారు.



# ఎడ్యుకేషన్ జిహాద్‌పై బీజేపీ ఆగ్రహం

## సైదాబాద్ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి

## బీజేపీ అధ్యక్షుడు రాంచంద్రరావు డిమాండ్

**హైదరాబాద్, జూలై 16 :** 'ఎడ్యుకేషన్ జిహాద్' ఉదంతాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మరోసారి స్పష్టం చేశారు. ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నిష్పాక్షికమైన, సమగ్రమైన దర్యాప్తు జరపాలన్నారు. పాఠశాల యాజమాన్యంతో పాటు కారకులైన ప్రతి ఒక్కరిపైనా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ఆ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని రాంచందర్ రావు పేర్కొన్నారు. సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్ ఘటనపై బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో 'ఎడ్యుకేషన్ జిహాద్' తారాస్థాయికి చేరిందంటూ ఆయన మండిపడ్డారు. ఇందుకు పాతబస్తీ సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్ ఘటనే ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. ఆ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న హిందూ విద్యార్థికి కల్మా, సూరా అల్-ఫాతిహాలను చదివి రావాలని హోమ్‌వర్క్‌గా ఇవ్వడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దుశ్చర్యకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే పూర్తి బాధ్యత వహించాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా 'కాంగ్రెస్ అంటే ముస్లింలు.. ముస్లింలు అంటే కాంగ్రెస్' అని, రేవంత్ చేసిన ఓటు బ్యాంకు, ముస్లిం సంతుష్టీకరణ రాజకీయాల వల్లే ఇలాంటి తీవ్రవాద ఆలోచనలు ఉన్న శక్తులకు తెగింపు పెరిగిందని రాంచందర్ రావు మండిపడ్డారు. తమ బిడ్డ చేత బలవంతంగా కల్మా రాయించడాన్ని గమనించి, పాఠశాల యాజమాన్యాన్ని ధైర్యంగా నిలదీసిన ఆ చిన్నారి తల్లి సాహసాన్ని తాను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని రాంచందర్ రావు పేర్కొన్నారు. ఇంతటి తీవ్రమైన ఉదంతం వెలుగులోకి వచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ సదరు పాఠశాల యాజమాన్యంపై ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. కేవలం ఒక ముస్లిం టీచర్‌ను బాధ్యతల నుంచి తప్పిస్తే సరిపోదని, ఈ ఘటనకు పూర్తి బాధ్యత స్కూల్ మేనేజ్‌మెంట్‌దేనని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో హిందువుల పరిస్థితి ఎంత దయనీయంగా మారిందో చెప్పడానికి ఈ ఘటనే ఉదాహరణ అని రాంచందర్ రావు పేర్కొన్నారు. హిందూ విద్యార్థులు, వారి కుటుంబాల భద్రత, ఆత్మగౌరవం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కళ్లు మూసుకుని వ్యవహరిస్తోందని మండిపడ్డారు. హిందూ విద్యార్థులపై వారి మతానికి సంబంధం లేని ప్రార్థనలు, కల్మాలు బలవంతంగా రుద్దడం ఏమాత్రం సహించబోమన్నారు. కొన్ని కాన్వెంట్ స్కూళ్లలో హిందూ విద్యార్థులు బొట్టు పెట్టుకుని రాకూడదని ఒత్తిడి చేస్తూ మతాచారాలకు దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. విద్యా సంస్థలు విద్యను అందించాలే తప్ప, విద్యార్థులపై ఏ మతాన్నీ రుద్దే హక్కు ఎవరికీ లేదన్నారు. ప్రతి విద్యార్థి రాజ్యాంగ హక్కులను గౌరవించాల్సిన బాధ్యత అన్ని పాఠశాలలపై ఉందన్నారు.

# డీలిమిటేషన్‌తో ఏ రాష్ట్రానికీ నష్టం జరగదు

## మహిళా బిల్లుతో వారి సాధికారితకు అవకాశం

## బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ స్పష్టం



**న్యూఢిల్లీ, జూలై16 :** డీలిమిటేషన్‌తో ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ స్పష్టం చేశారు. ప్రస్తుత సీట్లు తగ్గకుండా 50 శాతం వరకు పెంపునకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. వికసిత భారత్ – 2047 లక్ష్యంతో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగ నున్నాయని లక్ష్మణ్ వెల్లడించారు. గురువారం న్యూఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో అభివృద్ధి, సంస్కరణల ఎజెండాపై సభలో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా ప్రతినిధిగా 25 ఏళ్లు పూర్తయ్యాయని గుర్తుచేశారు. ఇది అభివృద్ధి పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. డిజిటల్ ఇండియా నుంచి ఆత్మనిర్భర్ భారత్ వరకు చారిత్రక నిర్ణయాలు తీసుకున్నారని వివరించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో వారి సాధికారతకు ఊతం అవుతుందని బీజేపీ ఎంపీ చెప్పారు. మహిళాబిల్లుతోపాటు డీలిమిటేషన్‌ను ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని విమర్శించారు. ఒకే దేశం – ఒకే ఎన్నిక దేశ ప్రయోజనాల కోసమేనని తెలిపారు. అవినీతి నిరోధక చట్టాలకు మద్దతు ఇవ్వాలని ప్రతిపక్షాలకు ఆయన సూచించారు. జేపీసీ నివేదిక తర్వాత కీలక బిల్లులపై ముందడుగు పడుతుందని ఎంపీ లక్ష్మణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు, మహిళలు, యువత అంశాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణలోని పెండింగ్ ప్రాజెక్టులపై పార్లమెంట్‌లో స్వరం వినిపిస్తామని అన్నారు. తెలంగాణకు కేంద్రం భారీగా నిధులు, అభివృద్ధి ప్రాజెక్టులు ఇచ్చిందని ఆయన వివరించారు. వర్షాకాల సమావేశాల్లో సభను అడ్డుకోవద్దని.. చర్చల్లో పాల్గొనాలని ప్రతిపక్షాలకు ఆయన స్పష్టం చేశారు. దేశ ప్రయోజనాలే అందరికీ అత్యున్నత ప్రాధాన్యత కావాలని తెలిపారు. వర్షాకాల సమావేశాలు దేశాభివృద్ధికి కొత్త దిశానిర్దేశర చేస్తాయని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో అన్ని అంశాలపై చర్చలకు సిద్ధంగా ఉన్నామని బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ వివరించారు.



# డీలిమిటేషన్ చుట్టూ రాజకీయ చదరంగం!

## పార్లమెంట్ సమావేశాల వేళ వేగం పెంచిన ఎన్డీఏ వ్యూహాలు

## రెండింట మూడొంతుల మెజారిటీపై బీజేపీ దృష్టి

మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ సర్కార్ దృష్టి అంతా ఇప్పుడు డీలిమిటేషన్‌పై ఉంది. ఈనెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. దీంతో ఈసారి ఎలాగైనా గండం గట్టెక్కేందుకు అవసర మైన వ్యూహాలతో సిద్ధం అవుతోంది. ఆయా రాష్ట్రాల్లోని రాజకీయాలను తనకు అనుకూలంగా మార్చుకుని ముందుకు సాగబోతున్నట్లు తాజా పరిస్థితులు చెప్పకనే చెబుతున్నాయి. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరని ఈ సమావేశాలు బహుశా నిరూపించనున్నాయి. వర్షాకాల పార్లమెంట్ సమావేశాలకు ముందు దేశ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ 131వ సవరణ బిల్లు మళ్లీ చర్చకు రావచ్చన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ బిల్లును ఆమోదించాలంటే లోక్‌సభలో మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం. ఇటీవల మారుతున్న రాజకీయ సమీకరణాలు ఎన్డీఏ ప్రభుత్వానికి ఈ లక్ష్యాన్ని చేరుకునే అవకాశాలను మరింత పెంచుతున్నాయనే చర్చ సాగుతోంది. గతంలో ఈ బిల్లుకు తగిన మద్దతు లభించక పోవడంతో అది ఆమోదం పొందలేదు. అయితే ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్‌లో చోటుచేసుకున్న పరిణామాలు, శివసేనలో జరిగిన మార్పులు, అలాగే శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ వర్గం నుంచి వస్తున్న సంకేతాలు ఎన్డీఏకు అనుకూలంగా మారుతున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా సుప్రియా సూలే చేసిన వ్యాఖ్యలు ఈ అంశంపై కొత్త చర్చకు దారితీశాయి. డీలిమిటేషన్ విషయంలో అన్ని రాష్ట్రాలకు సమాన న్యాయం జరిగేలా లోక్‌సభ సీట్లను 50 శాతం వరకు పెంచితే తమ పార్టీ సానుకూలంగా ఆలోచించే అవకాశముందని సుప్రియా సూలే వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరిం చుకుంది. గతంలో ఇదే అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా సీట్ల పెంపుపై చర్చించేందుకు సిద్ధమని పేర్కొనడం ఇప్పుడు మరోసారి ప్రస్తావనకు వస్తోంది. ఇటీవల ఎన్సీపి అధినేత శరద్ పవార్‌ను మహారాష్ట్ర డిప్యూటి సిఎం ఏక్‌నాథ్ షిండే కలుసుకుని చర్చించారు. బయటకు సాదాసీదా భేటీ అయినా రేపటి పార్లమెంట్ సమావేశాల్లో మద్దతకు సంబంధించిన వ్యవహారం సాగిందనే అంటున్నారు. ఇప్పటి రాజకీయ పరిస్థితుల్లో ఎన్డీఏకు ఇప్పటికే ఉన్న బలానికి అదనంగా తిరుగుబాటు చేసిన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, శివసేన నుంచి మారిన సభ్యులు, శరద్ పవార్ వర్గానికి చెందిన ఎంపీలు మద్దతు ఇస్తే సంఖ్య గణనీయంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. అయితే మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించడంలో డీఎంకే వైఖరి అత్యంత కీలకంగా మారింది. డీఎంకేకు చెందిన ఎంపీలు మద్దతు ఇస్తే ప్రభుత్వం లక్ష్యానికి మరింత చేరువ అవుతుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. రాజ్యాంగ 131వ సవరణ బిల్లు ద్వారా 2011 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ స్థానాల పునర్విభజన, సీట్ల సంఖ్య పెంపు, అలాగే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలుకు సంబంధించిన అంశాలు వేగవంతం చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. అందుకే ఈ బిల్లుకు కేంద్రం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. అయితే, ప్రతిపక్ష పార్టీలు ఈ అంశంపై ఇంకా పూర్తి స్థాయిలో తమ వైఖరిని వెల్లడించలేదు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే అవకాశాలపై గతంలో వ్యక్తమైన ఆందోళనలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అన్ని పార్టీలను ఒప్పించే ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తర్వాత డీలిమిటేషన్ బిల్లుపై ఎలాంటి చర్చ జరుగుతుంది..ఎన్డీఏ మూడింట రెండు వంతుల మెజారిటీని సమీకరించగలదా.. శరద్ పవార్ వర్గం, డీఎంకే వంటి పార్టీల తుది నిర్ణయం ఎలా ఉంటుంది.. అనే అంశాలపై దేశ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ సమావేశాల్లో జరిగే పరిణామాలు దేశ రాజకీయ దిశను ప్రభావితం చేసే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో గతంలో ఇండియా కూటమిలో ఉన్న డిఎంకె బయటకు వచ్చింది.దీంతో డిఎంకె కూడా కొంత మెత్తబడి ఎన్‌డిఎకు అనుకూలంగా మారనుందన్న సమాచారం. మరోవైపు తమిళనాడులో రాజకీయం మరింత వేడెక్కుతోంది. ఆ రాష్ట్రంలోని ఇండియా కూటమిలో విభేదాలు మరింత బయటపడుతున్నాయి. సీఎం జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం(టీవీకే)తో చేతులు కలిపేందుకు ద్రవిడ మున్నేట్ర కళగం(డీఎంకే) విముఖత చూపుతోంది. రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉన్న పార్టీలు.. జాతీయ స్థాయిలో మాత్రం కూటమిలో భాగస్వాములుగా కొనసాగవచ్చని విడుతలై చిరుత్తైగల్ కట్చి(వీసీకే) అధ్యక్షుడు తిరుమావళవన్ సూచించారు. దీనికి కాంగ్రెస్ మద్దతు తెలుపగా.. డీఎంకే మాత్రం ససేమిరా అంటోంది. ఈ సందర్భంగా డీఎంకే ఎంపీ గణపతి పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. 'ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొమ్మిదేళ్లుగా మాతో ఉన్న కాంగ్రెస్.. ఇప్పుడు టీవీకేకు మద్దతిస్తోంది. ఇది వెన్నుపోటుతో సమానం. మంత్రి పదవుల కోసమే కాంగ్రెస్ డీఎంకేను వదిలేసింది. ఇప్పుడు వీసీకేను మధ్యవర్తిగా వాడుకుంటూ మళ్లీ డీఎంకేను ఒప్పించే ప్రయత్నం చేస్తోందని వ్యాఖ్యానించారు. కేరళ, బెంగాల్ తరహా రాజకీయాలు తమిళనాడులో పనికిరావని రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రస్తుతం.. తమిళనాడులో టీవీకే మూడో ప్రధాన రాజకీయ పార్టీగా అధికారంలోకి వచ్చిందని, దీంతో రాష్ట్ర రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. అంతేకాకుండా.. ప్రస్తుతం పార్లమెంట్‌లో ఒక్క ఎంపీ కూడా లేని టీవీకేను ఇండియా కూటమిలో భాగంగా పరిగణించాలా అనే అంశంపైనా చర్చించాల్సిన అవసరముందని రాజ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ తమను వదులుకోవడం ద్వారా అది ఇండియా కూటమికే నష్టం చేకూరుస్తుందని ఆయన చెప్పుకొచ్చారు. మొత్తంగా ఇప్పుడు బిజెపి గేమ్‌ప్లాన్ బాగా వర్కవుట్ అయ్యేలా కనిపిస్తోంది.

# రూ.5 లక్షలకు 111 ప్రశ్నల విక్రయం

- నీట్ పేపర్ లీక్‌లో సంచలన అంశాలు
- సీబీఐ దర్యాప్తులో కీలక ఆధారాలు.. కోర్టుకు నివేదిక
- కోచింగ్ సెంటర్ నిర్వాహకుడి ఫోన్‌లో లీకైన ప్రశ్నల ఆనవాళ్లు
- పరీక్షకు 10 రోజుల ముందే ప్రశ్నలు చేరినట్లు సీబీఐ వెల్లడి



**న్యూఢిల్లీ, జూలై 16 :** నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీ కేసులో సీబీఐ దర్యాప్తు మరిన్ని కీలక విషయాలను వెలుగులోకి తెచ్చింది. రసాయన శాస్త్ర ప్రశ్నపత్రానికి చెందిన 111 ప్రశ్నలను రూ.5 లక్షలకు విక్రయించినట్లు ఆధారాలు లభించినట్లు సీబీఐ ఢిల్లీ ప్రత్యేక కోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొంది. కేసులో నిందితుడైన మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు శివరాజ్ రఘునాథ్ మోటేగావ్‌కర్ బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ దాఖలు చేసిన నివేదికలో ఈ వివరాలను వెల్లడించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రశ్నపత్రాల రూపకల్పన కమిటీలో సభ్యుడిగా పనిచేసిన పీవీ కులకర్ణి ద్వారా శివరాజ్ ప్రశ్నలను సేకరించినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు తెలిపింది. శివరాజ్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని పరిశీలించగా 36 ఫొటోలు లభించాయని, వాటిలో చేతితో రాసిన 132 రసాయన శాస్త్ర ప్రశ్నలు ఉన్నాయని సీబీఐ వెల్లడించింది. వీటిలో 111 ప్రశ్నలు నీట్-యూజీ 2026 మాస్టర్ ప్రశ్నపత్రంలోని ప్రశ్నలతో సరిపోలినట్లు తెలిపింది. ఆ ప్రశ్నలకు సంబంధించిన చేతిరాత నోట్స్ కూడా నిందితుడివేనని భావిస్తున్నట్లు కోర్టుకు వివరించింది. పరీక్షకు దాదాపు 10 రోజుల ముందు, అంటే ఏప్రిల్ 23 ప్రాంతంలోనే ఈ ప్రశ్నలు నిందితుడి వద్దకు చేరినట్లు దర్యాప్తులో తేలిందని సీబీఐ పేర్కొంది. ఇందుకోసం రూ.5 లక్షలు చెల్లించినట్లు ఆరోపించింది. అంతేకాకుండా లీకైన ప్రశ్నపత్రం పీడీఎఫ్ కాపీలను టెలిగ్రామ్ ద్వారా రూ.10 లక్షలకు విక్రయించినట్లు కూడా దర్యాప్తులో గుర్తించినట్లు తెలిపింది. పరీక్షకు కొన్ని వారాల ముందే 410 ప్రశ్నలతో కూడిన 150 పేజీల అంచనా ప్రశ్నపత్రాన్ని కొంతమంది అభ్యర్థులకు అందించగా, అందులోని సుమారు 120 ప్రశ్నలు అసలు నీట్ రసాయన శాస్త్ర ప్రశ్నపత్రంతో సరిపోలినట్లు వెల్లడించింది. ఈ కేసులో ఇప్పటివరకు 13 మందిని అరెస్టు చేసినట్లు సీబీఐ తెలిపింది. వారంతా ప్రస్తుతం న్యాయస్థాన కస్టడీలో ఉన్నారని పేర్కొంది. పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 3న నిర్వహించిన నీట్-యూజీ 2026 పరీక్షను రద్దు చేయగా, అనంతరం జూన్ 21న తిరిగి పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. కేసుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, ప్రశ్నపత్రం లీక్ నెట్‌వర్క్, ఇతర ప్రమేయంపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది.

# సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యంపై ఆందోళన



- అతడిని కాపాడాలంటూ ఢిల్లీ హైకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ, జూలై 16 :** పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యంపై కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. అతడి ఆరోగ్యాన్ని కాపాడాలని ఆదేశించింది. రెండు వారాలకుపైగా దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరాహార దీక్ష చేస్తున్నారు. ప్రవేశ పరీక్షల నిర్వహణలో లోపాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో గత నెలాఖరులో దీక్ష ప్రారంభించగా.. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం క్షీణిస్తోంది. దాంతో దిల్లీ హైకోర్టు జోక్యం చేసుకుంది. ఆయన ప్రాణాలు కాపాడేందుకు ప్రభుత్వ వైద్యుడి పర్యవేక్షణలో ఎటువంటి వైద్య చికిత్సలైనా అందించాలని గురువారం కేంద్రాన్ని ఆదేశించింది. ప్రతిపౌరుడి ప్రాణం అమూల్యమైంది. అలాంటి ప్రాణాలు కాపాడటానికి ప్రభుత్వాలు అన్ని ప్రయత్నాలు చేయాలని న్యాయస్థానం పేర్కొంది. మరో 48 గంటలు ఈ నిరాహారదీక్ష ఇలాగే కొనసాగితే 59 ఏళ్ల వాంగ్‌చుక్ ప్రాణాలకు ప్రమాదం వాటిల్లొచ్చంటూ బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. వాంగ్‌చుక్ గురించి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేసిన పిటిషనర్.. ఆయనకు బలవంతంగా ఆహారం అందించేలా ఆదేశాలు ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు.. తాజా ఆదేశాలు జారీ చేసింది. 19 రోజులుగా వాంగ్‌చుక్ దీక్ష చేస్తున్నారు. ఇన్ని రోజులుగా ఆహారం తీసుకోకపోవడంతో ఆయన 9 కేజీల వరకు బరువు తగ్గారని వైద్యనిపుణులు చెప్తున్నారు. తాజాగా తన మద్దతుదారులను ఉద్దేశించి ఆయన ఒక వీడియో విడుదల చేశారు. నా ఆరోగ్యం క్షీణించిన మాట వాస్తవమే. కానీ అత్యంత ప్రమాదకర స్థితికేం దిగజారలేదు. నిరాహార దీక్ష విరమించాలని నన్ను అడగడానికి బదులు జులై 20న 'చలో సంసద్' పేరిట పార్లమెంట్ వరకు నిర్వహించే శాంతియుత మార్చ్‌లో భాగం కావాలని మద్దతుదారులను ఆయన కోరారు.

# పట్టాలెక్కనున్న తొట్టతొలి హైడ్రోజన్ రైలు

## నేడు జెండా ఊపి ప్రారంభించనున్న ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, జూలై 16:** దేశంలో తొట్టతొలి హైడ్రోజన్ రైలు పట్టాలెక్కనున్నది. హర్యానాలోని జింద్ నుంచి ఆ రైలు ప్రారంభంకానున్నది. ప్రధాని మోదీ నేడు ఆ కొత్త రైలుకు పచ్చజెండా ఊపనున్నారు. హైడ్రోజన్ రైలు భారతీయ రైల్వే చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించనున్నది. జింద్ నుంచి సోనిపట్ మధ్య ఆ రైలు నడవనున్నది. ఈ రెండు స్టేషన్ల మధ్య 89 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రైలులో మొత్తం 10 కోచ్‌లు ఉంటాయి. గరిష్టంగా 75 కిలోమీటర్ల వేగంతో వెళ్తుంది. చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీలో దీన్ని డిజైన్ చేశారు. ఫ్యూయల్ సెల్ డీపీఆర్ఎస్ విధానంలో రైలు నడవనున్నది. 1200 కిలోవాట్ల ప్రొపల్షన్ సిస్టమ్ ఆ రైలుకు ఉంటుంది. 2025లో జింద్-సోనిపట మధ్య ట్రయల్స్ విజయవంతంగా నిర్వహించారు. మే 22వ తేదీన 10 కోచ్‌ల హైడ్రోజన్ రైలు కోసం రైల్వే బోర్డు అనుమతి ఇచ్చింది. హైడ్రోజన్ ట్రైన్ నెంబర్ 74010 జింద్ రైల్వే స్టేషన్ నుంచి ఉదయం 7.40 నిమిషాలకు బయలుదేరుతుంది. ఆ తర్వాత సోనిపేట్‌కు 9.40 నిమిషాలకు చేరుకుంటుంది. ఫ్యూయల్ సెల్స్ ఆధారంగా హైడ్రోజన్ రైలు విద్యుత్తను ఉత్పత్తి చేస్తుంది. హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య రియాక్షన్‌తో విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. ఆనోడ్‌పై హైడ్రోజన్, క్యాథోడ్‌పై ఆక్సిజన్ రియాక్ట్ అవుతుంది. ఆనోడ్‌లో హైడ్రోజన్ కణాలు.. ప్రోటాన్లు, ఎలక్ట్రాన్లుగా విభజన అవుతాయి. ప్లాటినం ఉత్ప్రేరకం ఆధారంగా ప్రోటాన్లతో ఆక్సిజన్ కలిసి వాటర్‌గా మారుతుంది. ఈ విధానంలో రైలు ఇంజిన్ నడుస్తుంది. హైడ్రోజన్ రైళ్లను 2018లో తొలిసారి జర్మనీలో ప్రవేశపెట్టారు. ఫ్రెంచ్ కంపెనీ ఆల్‌స్టామ్ వీటిని డెవలప్ చేశాయి. ఈ రైలు కోసం జింద్‌లో హైడ్రోజన్ జనరేషన్, రీఫ్యూయలింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. కంప్రెస్డ్ హైడ్రోజన్ గ్యాస్‌ను నిల్వ చేసేందుకు పెట్రోలియం శాఖ లైసెన్సు జారీ చేసింది. మొత్తం 12 స్టేషన్లలో రైలు ఆగుతుంది. జింద్ సిటీ, పాండు పిండర, లలిత్ ఖేరా, భంబేవా, ఇషాపూర్ ఖేరి, బూటానా, ఖంద్రాయి, గోహనా, రత్రా, లాత్, మోహనా హర్యానా, భర్వాస్ని స్టేషన్లలో ఆ రైలు ఆగనున్నది. శిలాజ ఇంధనాల తరహాలో హైడ్రోజన్ మూడు రెట్ల శక్తిని ఉత్పత్తి చేస్తుంది. అయితే ప్రస్తుతం ఈ విశ్వంలో హైడ్రోజన్ ఎక్కువ స్థాయిలో లభిస్తుంది. దీన్ని ఇంధనంగా వాడితే, అది కేవలం నీటి ఆవిరిని, వేడిని మాత్రమే బై ప్రోడక్ట్‌గా రిలీజ్ చేస్తుందని చెబుతున్నారు. దీని వల్ల పర్యావరణం పరిశుభ్రంగా ఉంటుందని భావిస్తున్నారు.

# 9వ తరగతిలో మూడో భాషపై సుప్రీం అభ్యంతరం

## బోర్డు పరీక్షలకు పునాది వేసే సమయంలో ఒత్తిడి తగదని వ్యాఖ్య

**న్యూఢిల్లీ, జూలై 16:** 9వ తరగతి విద్యార్థులకు మూడో భాషను తప్పనిసరి చేయడంపై సుప్రీంకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. బోర్డు పరీక్షలకు పునాది వేసే ఈ దశలో కొత్త భాషను ప్రవేశపెట్టడం విద్యార్థులపై అదనపు ఒత్తిడిని పెంచుతుందని వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో 9వ తరగతిలో మూడో భాషను ప్రవేశపెట్టవద్దని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. సీబీఎస్ఈ అమలు చేస్తున్న మూడు భాషల విధానాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. కొత్త భాషను నేర్చుకోవడం మంచిదేనని, అయితే బోర్డు పరీక్షలకు సన్నద్ధమయ్యే సమయంలో విద్యార్థులపై అదనపు భారం వేయడం సమంజసం కాదని అభిప్రాయపడింది. కొత్త భాషను చిన్న తరగతుల నుంచే బోధిస్తే విద్యార్థులకు అలవాటు కావడానికి సమయం దొరుకుతుందని పేర్కొంది. ఇటీవల సీబీఎస్ఈ 9వ తరగతి నుంచి మూడు భాషల విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో తల్లిదండ్రులు, పాఠశాలలు, విద్యార్థుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అమలుకు తగిన సమయం ఇవ్వలేదని, తగిన పాఠ్య పుస్తకాలు అందుబాటులో లేవని, అలాగే ఇతర సౌకర్యాలు కూడా పూర్తి స్థాయిలో లేవని విమర్శలు వచ్చాయి. కాగా, సుప్రీంకోర్టు ప్రస్తుతం ఈ విధానాన్ని పూర్తిగా నిలిపివేయలేదు. అయితే 9వ తరగతిలో మూడో భాషను తప్పనిసరి చేయడంపై కేంద్రం మరోసారి ఆలోచించాలని స్పష్టం చేసింది. ఈ అంశంపై తదుపరి విచారణలో కేంద్రం, సీబీఎస్ఈ తమ వైఖరిని వివరించనున్నాయి.

# పార్లమెంట్ సమావేశాలకు కొత్త నిబంధనలు

- జూలై 20 నుంచి వర్షాకాల సమావేశాలు
- ఎంపీలకు లోక్‌సభ సచివాలయం మార్గదర్శకాలు జారీ

**న్యూఢిల్లీ, జూలై 16 :** ఈ నెల 20 నుంచి ప్రారంభమై ఆగస్టు 17 వరకు కొనసాగే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో లోక్‌సభ సచివాలయం ఎంపీలకు కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. పార్లమెంట్‌లో భద్రతా ప్రమాణాలు మరింత కట్టుదిట్టం చేయడంతో పాటు సభ్యుల వ్యక్తిగత గోప్యతను కాపాడే లక్ష్యంతో ఈ నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చింది. కొత్త మార్గదర్శకాల ప్రకారం సభలోకి స్మార్ట్ వాచీలు, స్మార్ట్ కళ్లద్దాలు, పెన్ కెమెరాలు వంటి ఎలక్ట్రానిక్ నిఘా పరికరాలను తీసుకురావడాన్ని పూర్తిగా నిషేధించారు. సభా కార్యకలాపాలను అనధికారికంగా చిత్రీకరించడం, వీడియోలు రికార్డు చేయడం లేదా రహస్యంగా సమాచారాన్ని సేకరించే ప్రయత్నాలను అడ్డుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు లోక్‌సభ సచివాలయం తెలిపింది. డిజిటల్ భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో పార్లమెంట్‌లోకి ప్రవేశించే ప్రతి సభ్యుడు, అధికారి, సిబ్బంది ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది. భద్రతా చర్యలతో పాటు పార్లమెంట్ ఆవరణలో ధర్నాలు, రాజకీయ నిరసనలు నిర్వహించడంపై కూడా పూర్తి నిషేధం విధించారు. ప్లకార్డులు ప్రదర్శించడం, ఆయుధాలు తీసుకురావడం, సభా మర్యాదలకు భంగం కలిగించే చర్యలకు అనుమతి ఉండదని బులిటెన్‌లో పేర్కొన్నారు. అలాగే పార్లమెంట్ ప్రాంగణంలో ఎలాంటి మతపరమైన కార్యక్రమాలు, పూజలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. సభా గౌరవం, క్రమశిక్షణ, శాంతిభద్రతలను పరిరక్షించేందుకు ఎంపీలందరూ కొత్త మార్గదర్శకాలను పాటించాలని లోక్‌సభ సచివాలయం విజ్ఞప్తి చేసింది.



చురకలు



# ఉచిత కంప్యూటర్ శిక్షణ ను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ ప్రియాంక.

**నారాయణపేట, జులై,16**

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు. బేటీ బచావో - బేటీ పడావో పథకంలో భాగంగా జిల్లా కేంద్రంలోని సత్య సాయి కాలనీ లో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా శిక్షణ కు వచ్చిన విద్యార్థినులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో కంప్యూటర్ విద్యకు ఎంతో ప్రాధాన్యం ఉందని తెలిపారు.అందరూ సెల్ ఫోన్ లో చాట్ జీపీటీ యాప్ ను డౌన్ లోడ్ చేసుకోవాలని, ఇప్పుడు అదే వర్డ్ డాక్యుమెంట్‌ను కూడా ఇది తయారు చేసి ఇస్తుందన్నారు. మనం ఏదైనా సమాచారం



కోసం టైప్ చేసి రాయడానికి సమయం తీసుకునేలోపే, అడిగిన సమాచారాన్ని సిద్ధం చేసి అందిస్తుందన్నారు.ప్రస్తుతం టెక్నాలజీ అంత ముందుకు వెళ్లిందనీ, ఈ బేసిక్స్‌తో పాటు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ నేర్చుకోవడం కూడా అంత కష్టమేమీ కాదన్నారు. శిక్షణలో ఇవన్నీ నేర్చుకోవాలని,తర్వాతి క్లాస్‌లో మీరు ఇవన్నీ చేయగలుగుతున్నారా ? లేదా చూస్తాననీ ఆమె చెప్పారు. ప్రాక్టీస్ చేయడం ద్వారా కొత్త విషయాలు నేర్చుకోవడమే కాకుండా, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని కూడా ఉపయోగించిన వారవుతారనీ ఆమె తెలిపారు.అందరూ తప్పనిసరిగా డిగ్రీ పూర్తి చేయాలని,ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు కూడా చాలా వస్తున్నాయనీ,ప్రభుత్వ ఉద్యోగాలకు మాత్రమే కాకుండా, ప్రైవేట్ ఉద్యోగాలకు కూడా తప్పకుండా అప్లై చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ రాజేందర్ గౌడ్, వార్డు కౌన్సిలర్ కందేన్ పల్లి సత్యమ్మ, డీ డబ్ల్యు ఓ కార్యాలయ ఉద్యోగులు, కంప్యూటర్ శిక్షకులు పాల్గొన్నారు.

# కేసుల ఛేదనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్ధవంతంగా వినియోగించాలి

- **జిల్లా క్రైమ్ స్టాఫ్, సైబర్ వారియర్స్‌కు దిశానిర్దేశం చేసిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS**

**వికారాబాద్, జులై,16**

వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా క్రైమ్ స్టాఫ్, సైబర్ వారియర్స్‌కు CDR, IPDR, టవర్ డంప్ అనాలిసిస్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ (X) మరియు ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ లు మరియు హ్యూమన్ ఇంటెలిజెన్స్ ద్వారా నేరాల దర్యాప్తు, పెండింగ్ కేసుల ఛేదన అంశాలపై నిర్వహించిన ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రస్తుతం నేరాల స్వరూపం వేగంగా మారుతున్నందున సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి అవగాహన ప్రతి దర్యాప్తు అధికారికి అత్యంత అవసరమని తెలిపారు. నేరస్థులు మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, డిజిటల్ కమ్యూనికేషన్‌ను విస్తృతంగా వినియోగిస్తున్న నేపథ్యంలో, CDR, IPDR, టవర్ డంప్ డేటా విశ్లేషణతో పాటు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో మరియు హ్యూమన్ ఇంటెలిజెన్స్ ద్వారా సమర్థవంతమైన శోధన ద్వారా కీలక ఆధారాలను సేకరించి కేసులను త్వరితగతిన ఛేదించవచ్చని సూచించారు.పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, సాంకేతిక ఆధారాలను వినియోగించి నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని, ప్రతి కేసులో డిజిటల్ సాక్ష్యాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించి కోర్టులో బలమైన అభియోగపత్రాలు దాఖలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అదేవిధంగా, సోషల్ మీడియా వేదికల ద్వారా నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించడం, పరారీలో ఉన్న నిందితుల ఆచూకీ




కనుగొనడం, మోసాలు, సైబర్ నేరాలు, మహిళలు మరియు చిన్నారులకు సంబంధించిన కేసుల్లో డిజిటల్ ఇంటెలిజెన్స్‌ను సమర్థంగా వినియోగించాలని సూచించారు.ప్రతి దర్యాప్తు అధికారికి సహాయకంగా ప్రతి క్రైమ్ స్టాఫ్ సిబ్బంది ఆధునిక దర్యాప్తు పద్ధతులపై నిరంతరం అవగాహన పెంపొందించుకోవాలని, కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకుని ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించేలా కృషి చేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు.ఈ శిక్షణ కార్యక్రమంలో డిటిసి డీఎస్పీ శ్రీనివాస్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్, ఐటి సెల్ ఎస్సె శంకర్,ఐటి సెల్ సిబ్బంది, జిల్లా క్రైమ్ స్టాఫ్, సైబర్ వారియర్స్ మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మేడారం అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

**ములుగు, జూలై 16**

సమ్మక్క–సారలమ్మ మహా జాతరకు వచ్చే కోట్లాది మంది భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు మేడారం అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు నివారించేందుకు ప్రధాన రహదారుల విస్తరణ, క్యూ లైన్ల ఆధునికీకరణ, డ్రైనేజీ పనులు, జంపన్న వాగు సుందరీకరణ, చెక్‌డ్యామ్ నిర్మాణ ప్రతిపాదనలు వేగవంతం




చేయాలని సూచించారు. మేడారం ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు తాగునీరు, విద్యుత్, వైద్య సేవలు, భద్రత వంటి అన్ని మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, మేడారం అభివృద్ధి పనులను గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

# తొలి బోనంతో గోల్కొండలో ఆషాఢ బోనాల వైభవారంభం





**హైదరాబాద్, జూలై 16**

గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి ఆలయంలో తొలి బోనంతో ఆషాఢ బోనాల ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా–బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తదితర ప్రజాప్రతినిధులు తొలి బోనం ఎత్తుకుని పట్టు వస్త్రాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. బోనాల సంప్రదాయం శతాబ్దాల చరిత్ర కలిగిందని, ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం భారీ నిధులు కేటాయిస్తోందని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, తెలంగాణ బోనాలు సంస్కృతి, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అమ్మవారి దర్శనం చివరి భక్తునికి కూడా కల్పించాలని, పోలీసు శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. పోతురాజుల విన్యాసాలు, సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకోగా, వేలాదిమంది భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ప్రభుత్వం చేసిన ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, అడిషనల్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, ఆలయ చైర్మన్ ఆకుల చంద్రశేఖర్, ఆలయ ఈవో వసంతతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావం: ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక వెంటనే అమలు చేయాలి

**మహబూబ్‌నగర్, జూలై 16**

ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల కార్యాచరణ ప్రణాళికను వెంటనే అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో సాగయ్యే పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగిం జల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కోయిల్‌సాగర్ నీటి నిల్వలకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించాలని, ప్రతి మండలంలో గ్రామసభలు నిర్వహించి రైతులకు మార్గ దర్శకాలు అందించాలని చెప్పారు. అనం తరం వ్యవసాయ శాఖ రూపొందించిన రైతు సూచనల కరపత్రాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు.




# లక్ష్యం మేరకు నిజామాబాద్ జిల్లాలో ఆయిల్ పామ్ సాగు: కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నిజామాబాద్, జూలై 16**




జాతీయ ఆహార నూనెల మిషన్–ఆయిల్ పామ్ (NMEO-OP) పథకం కింద జిల్లాలో నిర్దేశిత లక్ష్యం మేరకు ఆయిల్ పామ్ సాగు కొన సాగుతోంద ని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఇప్పటి వరకు 134.50 ఎకరాల్లో 6,725 మొక్కలు నాటగా, జిల్లాలో మొత్తం 6,500 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగులో ఉందన్నారు. ఈ ఏడాది మరో 2,000 ఎకరాలకు సరిపడా 2 లక్షల మొక్కలను నర్సరీలో సిద్ధంగా ఉంచామని తెలిపారు. 2027 మార్చి నాటికి లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ అధిక లాభదాయకమని, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని రైతులు ఈ పంట సాగుకు ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# ప్రత్యామ్నాయ పంటలతో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవాలి: కలెక్టర్

**పెద్దపల్లి, జూలై 16**



ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు వ్యవసాయ శాఖ సూచనల మేరకు ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. జిల్లాలో 207 గ్రామాలు మోస్తరు ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. జూలై 16 నుంచి 31 వరకు 89,892 ఎకరాల్లో వివిధ పంటల సాగుకు ప్రణాళిక రూపొందించామని, అవసరమైన దానికంటే ఎక్కువ విత్తనాలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పంటల ఎంపిక, సాగు విధానాలను పాటించాలని కలెక్టర్ కోరారు.

# సెర్ప్ సిబ్బందికి వైద్య శిబిరం ప్రారంభించిన కలెక్టర్



**సిద్దిపేట, జూలై 16:**

సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి వద్ద జిల్లా సెర్ప్, ఎస్ఆర్‌డీఎస్ సిబ్బందికి ఎరిక్సన్ ఇన్సూరెన్స్ టిపిఏ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ప్రారంభించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు పాటించాలని, ప్రతిరోజూ వ్యాయామం, నడక, సమతుల్య ఆహారం, తగినంత నీరు తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రేణుక తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 3 వరకు సర్ (SIR) గడువు పొడిగింపు: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్, జూలై 16**



రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమం గడువును ఎన్నికల సంఘం ఆగస్టు 3 వరకు పొడిగించిందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. కొత్త షెడ్యూల్ ప్రకారం బూత్ స్థాయి అధికారులు (BLOలు) ఆగస్టు 3 వరకు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు సేకరిస్తారని వెల్లడించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా, అనర్హుల పేర్లు నిబంధనల మేరకు తొలగించే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఇంటింటి సర్వే, ఫీల్డ్ వెరిఫికేషన్, దరఖాస్తుల పరిశీలనను అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని, ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి అందిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని బీఎల్‌ఓలకు కలెక్టర్ ఆదేశించారు.

# దుబాయ్‌లో 500 ఉద్యోగాలు.. జూలై 21న ఇంటర్వ్యూలు

**పెద్దపల్లి, జూలై 16**

దుబాయ్‌లోని ప్రముఖ కంపెనీలో 500 ఉద్యోగాల భర్తీకి జూలై 21న హైదరాబాద్‌లోని టామ్‌కామ్ కార్యాలయంలో వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ తెలిపారు. క్లీనర్స్, మేసన్లు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, వెల్డర్లు తదితర విభాగాల్లో అనుభవం ఉన్న అభ్యర్థులు బయోడేటా, పాస్‌పోర్ట్, విద్యార్హత, అనుభవ ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. ఎంపికైన వారికి వేతనంతో పాటు వసతి, భోజనం, రవాణా సౌకర్యాలు కల్పిస్తారు.

# రోడ్లపై అక్రమ పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు

### అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ హుల్ హక్



**నారాయణపేట, జులై,16**

డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇబ్బందులు, అక్రమ పార్కింగ్ లపై పలు విన్నతులు వచ్చినందున జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, IPS ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించడం లక్ష్యంగా అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ హుల్ హక్ పట్టణంలోని ప్రధాన రహదారులను పరిశీలించారు.ఈ సందర్భంగా టౌన్ సీఐ శివశంకర్, టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్యతో కలిసి సరబ్ బజార్, మెయిన్ చౌక్ నుంచి ఓల్డ్ బస్టాండ్, సత్యనారాయణ చౌరస్తా, యాద్గిరి ప్రధాన రహదారి తదితర రద్దీ ప్రాంతాలను సందర్శించి ట్రాఫిక్ పరిస్థితిని సమీక్షించారు. రహదారులపై అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలు, షాపుల ముందు ఆక్రమణలు, ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే పరిస్థితులను పరిశీలించి సంబంధిత షాపు యజమానులు, వాహనదారులకు సూచనలు చేశారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ... ప్రజల సౌకర్యమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, రహదారులపై ఇష్టానుసారంగా వాహనాలను నిలిపివేయడం వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉంటుందని అన్నారు. షాపులకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను రోడ్లపై కాకుండా అందుబాటులో ఉన్న పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపివేయాలని సూచించారు.రోడ్లపై అక్రమ పార్కింగ్, ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే ఆక్రమణలు, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నిలిపివేయడం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై మోటారు వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే వాహనాలను టోయింగ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వ కూడదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. వ్యాపారులు కూడా తమ దుకాణాల ముందు రహదారిపై వస్తువులను ఉంచకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సహ కరించాలని కోరారు.నారాయణపేట పట్టణంలో ట్రాఫిక్‌ను మరింత క్రమబద్ధీక రించేందుకు ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని,ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించి సురక్షితమైన, ట్రాఫిక్ అంతరాయం లేని పట్టణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని అదనపు ఎస్పీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ శివశంకర్, టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# భారత్ తొలి హైడ్రోజన్ రైలు జూలై 17న ప్రారంభం

**న్యూఢిల్లీ, జూలై 16**

: భారత రైల్వే చరిత్రలో మరో మైలురాయిగా నిలిచే దేశ తొలి హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ రైలును జూలై 17న ఉత్తర రైల్వే పరిధిలోని జింద్–సోనిపట్ మార్గంలో ప్రారంభించనున్నారు. 1200 కిలోవాట్ల హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ తో నడిచే ఈ రైలు ప్రయాణ సమయంలో నీటి ఆవిరి, ఉష్ణం మాత్రమే విడుదల చేయడంతో కాలుష్యం దాదాపు ఉండదు. పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన ఈ 10 బోగీల రైలు సుమారు 2,600 మంది ప్రయాణికులను తీసుకెళ్లగలదు. దీని గరిష్ఠ వేగం గంటకు 75 కిలోమీటర్లు. రైలు నిర్వహణ కోసం జింద్ లో దేశంలోనే అతిపెద్ద రైల్వే హైడ్రోజన్ నిల్వ, రీఫ్యూయలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. హైడ్రోజన్ లీకేజీ, మంటలు, పొగను గుర్తించే ఆధునిక భద్రతా వ్యవస్థలు, 24 గంటల పర్యవేక్షణతో రైలు సురక్షితంగా నడిచేలా చర్యలు తీసుకున్నారు.



# అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలి

### జిల్లా కలెక్టర్ ప్రియాంక.



**నారాయణపేట, జులై,16**

అర్హులైన లబ్ధిదారులకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు.గురువారం జిల్లా కలెక్టరేట్ వీసీ హాల్ లో పీ ఎం ఎఫ్ ఎం ఈ, పీఎం విశ్వకర్మ పథకాల కింద తిరస్కరించబడిన దరఖాస్తులపై కలెక్టర్ బ్యాంకర్ల తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... ఎస్‌బీఐ శాఖలలో తిరస్క రణలు (Rejections) అధికంగా ఉన్నాయని తెలిపారు. అన్ని దరఖాస్తులను స్పష్టంగా పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇతర బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తున్నప్పటికీ, ఎస్‌బీఐలో మాత్రమే ఎక్కువ తిరస్కరణలు నమోదవుతున్నాయని పేర్కొన్నారు.ఈ విషయంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (LDM) సమన్వయం చేసి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.వివిధ బ్యాంకులకు కేటాయించిన పీఎం విశ్వకర్మ దరఖాస్తులను బ్యాంకుల వారీగా సమీక్షించి, అర్హులైన వారికి రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. బ్యాంకుల వారీగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ రుణాల వివరాలను ఆ కార్పొరేషన్ ఈ డీ అబ్దుల్ ఖలీల్ సమావేశంలో వివరించగా, పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.బ్యాంకర్లు, ఏపీఎంలు, డీపీఎంలు పరస్పర సమన్వయంతో పనిచేసి, ఎలాంటి గ్యాప్‌లు లేకుండా అన్ని పెండింగ్ అంశాలను పరిష్కరించాలని ఆమె సూచించారు.పీ ఎం డీ డి కే వై కార్యక్రమంపై ప్రస్తుతం ప్రత్యేక సమీక్ష జరుగుతోందని, ఢిల్లీ నుంచి ప్రత్యేక అధికారి కూడా సమీక్ష నిర్వహిస్తున్నందున, లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని తెలిపారు.బ్యాంకులు ఆమోదించిన రుణాలను వీలైనంత త్వరగా గ్రౌండింగ్ చేయాలని, ఆగస్టు 15 న చివరి గడువుగా నిర్దేశించినందున, అప్పటిలోగా 100 శాతం గ్రౌండింగ్ పూర్తి చేయాలని సూచించారు.అన్ని పథకాలలో లక్ష్యాలను 100 శాతం సాధించే దిశగా బ్యాంకర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.స్త్రీ నిధి రుణాలు, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలను కూడా క్రమం తప్పకుండా సమీక్షించి, పురోగతిని వేగవంతం చేయాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో డీ ఆర్డీ ఓ వెంకట్ రాములు, ఎల్ డీ ఎం విజయ్ కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్, మున్సిపాల్టీ కమిషనర్ శంకర్, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

# వర్కట్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

### సిర్పంగి స్వామి సిపిఎం మండల కార్యదర్శి

**వలిగొండ జులై 16**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ వర్కట్ పల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న పోస్టులన్నిటిని వెంటనే భర్తీ చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు.

గురువారం రోజున మండల పరిధిలోని వర్కట్ పల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సిపిఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్స్, హెల్త్ అసిస్టెంట్, హెల్త్ సూపర్వైజర్, డిఇఓ, అటెండర్ లాంటి అనేక పోస్టులు ఖాళీలుగా ఉన్నాయని ప్రభుత్వం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బాగా అభివృద్ధి చేస్తున్నామని ఒకవైపు గొప్పలు చెబుతూ మరొకవైపు కనీస సౌకర్యాలకు కాళీ పోస్టులకు దర్శనం ఇచ్చే విధంగా ఆస్పత్రులను మార్చిందన్నారు. నాలుగు సబ్ సెంటర్లు సుమారు 15 గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున ఆసుపత్రికి రావడం జరుగుతుందని రెండవ మెడికల్ ఆఫీసర్ ను నియమించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఖాళీగా ఉన్న పోస్టులతో ఆసుపత్రికి వచ్చే రోగులకు ఏరకంగా సక్రమమైన వైద్య సేవలు అందుతాయని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వెంటనే జిల్లా స్థాయి వైద్యశాఖ అధికారులు మరియు స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వం కాళీ పోస్టులను భర్తీ చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి గూడూరు బుచ్చిరెడ్డి, మెట్టు రవీందర్ రెడ్డి చేగురి నరసింహ,ఆకుల మారయ్య,మాదుగుల వెంకటేశం,రొండి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.




# గ్రామీణాభివృద్ధి పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్ ప్రతీక్

**సంగారెడ్డి, జూలై 16 :**

జిల్లాలో గ్రామీణాభివృద్ధి పనుల్లో జాప్యానికి తావివ్వకుండా వేగంగా పూర్తి చేయాలని, ప్రభుత్వ ఫ్లాగ్ షిప్ కార్యక్రమాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లో నిర్వహించిన సమీక్షలో వివో భవనాలు, గ్రామపంచాయతీ, అంగన్ వాడీ భవనాలు, పాఠశాల మరుగుదొడ్లు, కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ లు, ఇందిరమ్మ ఇళ్లు, కాంపౌండ్ వాల్స్, కల్వర్టులు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా తదితర పనుల పురోగతిని మండలాల వారీగా సమీక్షించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, పాఠశాలల్లో అవసరమైన మరుగుదొడ్లు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని సూచించారు. ఎంపీడీవోలు, డివిజనల్ పంచాయతీ అధికారులు క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.




## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు వేగంగా పరిష్కరించాలి: బక్కి వెంకటయ్య




**నిర్మల్, జూలై 16 :**

ఎస్సీ, ఎస్టీల సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. పెండింగ్ అట్రాసిటీ కేసులను వేగంగా దర్యాప్తు చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలని సూచించారు. నిర్మల్ కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో సంక్షేమ పథకాల అమలు, అట్రాసిటీ కేసులు, ఉపాధి హామీ, ఇందిరమ్మ ఇండ్లు, విద్యార్థుల సంక్షేమంపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 4,306 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, అట్రాసిటీ కేసుల దర్యాప్తు వేగంగా కొనసాగుతోందని జిల్లా అధికారులు తెలిపారు.

## వరుణ దేవుడు కరుణించాలని కొడంగల్ మున్సిపల్ రెండో వార్డు కౌన్సిలర్

### ఆర్.వాణిశ్రీ మధు సూదన్ యాదవ్

### స్వ గృహంలో కప్ప కావిడితో పూజలు



**కొడంగల్ మున్సిపల్,16**

వర్షా కాలం ప్రారంభమైనా సరైన వర్షాలు కురవక పోవడంతో వరుణ దేవుడు కరుణించి వర్షాలు సమృద్ధిగా కురవాలని గురువారం కొడంగల్ మున్సిపల్ రెండో వార్డు కౌన్సిలర్ ఆర్.వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ స్వగృహంలో గాంధీనగర్ కాలనీ మహిళలు కప్ప కావిడితో ప్రత్యేక పూజలు నిర్వహించారు.రోహిణి కార్తె నుంచి ఆరుద్ర కార్తె వరకు ఆశించిన వర్షాలు పడకపోవడంతో వరుణ దేవుడు కరుణించాలని కోరుకున్నారు. కట్టెకు కోండ్రు కప్ప వేపాకులపై ఉంచి పసుపు, కుంకుమ, వేసి ఇంటింటికి తిప్పుతూ, బిందెల నుండి బయలు నీళ్లు తెచ్చి పోశారు. వానమ్మా వానమ్మా ఒక్కసారి వచ్చిపోవా అంటూ వరుణ దేవుడిని ఆటపాటలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మధు సూదన్ యాదవ్,మిఠాయి రాజేందర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## రాష్ట్రపతి జగన్నాథ స్వామిపై రాసిన వ్యాసాన్ని పంచుకున్న ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ, జూలై 16 :**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మహాప్రభు జగన్నాథుడిపై తన జీవితాంత భక్తి, చిన్ననాటి జ్ఞాపకాలు, రథయాత్ర ఆధ్యాత్మిక అనుభవాలను వివరిస్తూ రాసిన వ్యాసాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పంచుకున్నారు. ప్రజాసేవలో తనకు మార్గదర్శకంగా నిలిచిన జగన్నాథుడిపై రాష్ట్రపతి వ్యక్తపరిచిన విశ్వాసం, రథయాత్ర వైభవాన్ని ఆమె హృదయపూర్వకంగా వివరించారని ప్రధాని పేర్కొన్నారు.

## గ్రామ సభల ద్వారా భూముల రీ-సర్వే పనులు వేగవంతం చేయాలి:

### అదనపు కలెక్టర్ బి.ఎస్. లత




**జగిత్యాల, జూలై 16**

భూముల రీ–సర్వే ప్రక్రియను గ్రామ సభల ద్వారా వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత సూచించారు. ధర్మపురి, గొల్లపెల్లి మండలాల నాగారం, అబ్బాపూర్ గ్రామాల్లో నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా Survey and Boundary Act, 1923 నిబంధనలు, రీ–సర్వే విధానం, సర్వే నిర్వహణ ప్రక్రియపై రైతులు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు శ్రీనివాస్, మాజిద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## భారత్ తొలి హైడ్రోజన్ రైలు సిద్ధం

**న్యూఢిల్లీ, జూలై 16 ):**

భారతీయ రైల్వేలు దేశంలోని తొలి హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ రైలును ప్రారంభించేందుకు సిద్ధమయ్యాయి. 10 కోచ్‌ల ఈ రైలు సుమారు 2,600 మంది ప్రయాణికులను తీసుకెళ్లగలదు. హర్యానాలోని జింద్–సోనిపట్ మార్గంలో ప్రారంభంగా నడవనుంది. హైడ్రోజన్‌తో రైలులోనే విద్యుత్ ఉత్పత్తి అవుతుండగా, నీటి ఆవిరి మాత్రమే విడుదల అవుతుంది. పొగ, కార్బన్ ఉద్గారాలు ఉండవు. హైడ్రోజన్ లీకేజీ, మంటలు, పొగను గుర్తించే అధునాతన భద్రతా వ్యవస్థలు, ఆటోమేటిక్ షట్‌డౌన్ సదుపాయాలతో రైలును రూపొందించారు. జింద్‌లో దేశంలోనే అతిపెద్ద రైల్వే హైడ్రోజన్ రీఫ్యూయలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టు స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేయబడింది.

# వలిగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఏసిఎస్) నూతన పాలకవర్గం బాధ్యతలు స్వీకరణ

**వలిగొండ జూలై 16**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఏసిఎస్) నూతన పాలకవర్గం ఈరోజు అధికారికంగా కొలువుదీరింది.

నూతన చైర్మన్‌గా గరిసె రవి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వైస్ చైర్మన్‌గా జక్క జంగారెడ్డి, డైరెక్టర్లుగా బత్తిని లింగమ్మ, యెమ్మె మల్లేశం, బూడిద పద్మ, కట్ట లింగస్వామి, గూడూరు మోహన్ రెడ్డి, వనగంటి జహంగీర్, బుగ్గ బీరప్ప, కాలకూరి చంద్రయ్య, బర్ల నర్సింహ, బంగారి మహిపాల్, వనం నర్సింహలు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ గరిసె రవి మాట్లాడుతూ, భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి తమపై ఉంచిన విశ్వాసానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ రైతుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామని పేర్కొన్నారు. రైతులకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందిస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గ సభ్యులకు వలిగొండ ప్రాంత ప్రజాప్రతినిధులు, సహకార సంఘ సభ్యులు, రైతులు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు.



# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**హనుమకొండ, జూలై 16**

హనుమకొండ వడ్డేపల్లిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆకస్మికంగా సందర్శించి విద్యాబోధన, మౌలిక సదుపాయాలు, బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేసి ఆహార నాణ్యతపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

అనంతరం విద్యార్థినులతో సమావేశమైన కలెక్టర్, ఫిజిక్స్ సహా పలు సబ్జెక్టులపై ప్రశ్నలు అడిగి వారి అవగాహనను పరీక్షించారు. అధ్యాపకులు నాణ్యమైన బోధన అందించి విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. అలాగే నీట్, జేఈఈ వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేకంగా సిద్ధం చేయాలని, ఫిజిక్స్ వాలా ఆన్‌లైన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థినులకు సూచించారు.



# టిబి ముక్త్ భారత్ అభియాన్ (టిబిఎంబీఏ) ప్రచార కార్యక్రమం.

## ఎన్‌సీడీ ఎక్స్‌రే స్క్రీనింగ్ శిబిరం నిర్వహణ.

**వలిగొండ జూలై 16**

యాదాద్రి భువనగిరి జిల్లా వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ) పరిధిలోని అరూరు గ్రామంలో టిబి ముక్త్ భారత్ అభియాన్ (టిబిఎంబిఏ) ప్రచార కార్యక్రమంతో పాటు ఎన్‌సీడీ (మధుమేహం, రక్తపోటు తదితర అంటురాని వ్యాధులు) ఉచిత ఎక్స్‌రే స్క్రీనింగ్ శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ సుక్క ముత్యాలు మరియు వార్డు సభ్యులు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలకు క్షయవ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, ముందస్తు నిర్ధారణ, ఉచిత చికిత్స, చికిత్సను పూర్తిగా తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై ఆరోగ్య సిబ్బంది విస్తృతంగా అవగాహన కల్పించారు. శిబిరంలో టిబి అనుమానితులకు డిజిటల్ ఛాతీ ఎక్స్‌రే స్క్రీనింగ్, అవసరమైన వారికి కఫ నమూనాల సేకరణ, అలాగే మధుమేహం, రక్తపోటు తదితర అంటురాని వ్యాధుల స్క్రీనింగ్ నిర్వహించారు. అనుమానితులకు తదుపరి పరీక్షలు, చికిత్స కోసం అవసరమైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, ఎన్ టి ఈ పి సిబ్బంది, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. టిబిని ముందుగానే గుర్తించి, పూర్తిస్థా యిలో చికిత్స తీసుకుంటే టిబిని పూర్తిగా నయం చేయవచ్చు. టిబి రహిత భారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి అని వైద్య అధికారులు ప్రజలకు పిలుపునిచ్చారు.



# సాంఘిక సంక్షేమ గురుకులాలలో పోస్టుల భర్తీకి చర్యలు

- **జిఎస్ డబ్ల్యు ఆర్ఐఈఎస్ సమన్వయకర్త కోటూరి రామ కళ్యాణి**

**మంచిర్యాల, జూలై 16 :**



తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థచే నడుపబడుతున్న సాంఘిక సంక్షేమ గురుకులాలలో తాత్కాలిక అధ్యాపకులు, ఉపాధ్యాయుల భర్తీకి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, టిజిఎస్ డబ్ల్యు ఆర్ఐఈఎస్ సమన్వయకర్త కోటూరి రామ కళ్యాణి ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 9 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలో ఆంగ్ల మాధ్యమంలో బోధన చేసేందుకు తాత్కాలిక బోధనా సిబ్బంది ఎంపిక కొరకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. సైన్స్, ఆర్ట్స్ కళాశాలలో అందుబాటులో ఉన్న ఖాళీల మేరకు తాత్కాలిక పద్ధతిన జూనియర్ లెక్చరర్, పిజిటి, టిజిటి, స్పెషల్ టీచర్ల కొరకు జూలై 23వ తేదీ సాయంత్రం 4 గంటలలోగా జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో కార్యాలయ పని వేళలలో అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. 25వ తేదీన జూనియర్ లెక్చరర్, పిజిటి క్యాడర్ ఖాళీలకు, 27వ తేదీన టిజిటి, స్పెషల్ టీచర్ క్యాడర్ 2 రోజులపాటు ఉదయం 9 నుండి తరగతి బోధన పరిశీలన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జూనియర్ లెక్చరర్, పిజిటి పోస్టులకు యుజిసి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి కనీసం 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పిజి డిగ్రీ తో పాటు బిఈడి అర్హత, టిజిటి పోస్ట్ కు యుజిసి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి బిఎస్సి, బిఎ, బికాం డిగ్రీ కనీసం 50 శాతం మార్కులతో పాటు బిఈడి. అర్హత కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు నిర్దేశిత తేదీలలో తమ పూర్తి బయోడేటా తో పాటు ధృవపత్రాల పరిశీలన కొరకు తమ విద్యార్హతలను తెలిపే ఒరిజినల్ ధ్రువపత్రాలు, ఒక జత నకలు ప్రతులను తీసుకొని లక్షెట్టిపేట మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో సకాలంలో హాజరుకావాలని తెలిపారు. బాలికల విద్యాలయాలలో పనిచేయడానికి మహిళ అభ్యర్థులు మాత్రమే అర్హులని, ప్రకటించబడిన ఖాళీలలో ఎంపిక కమిటీ నిర్ణయానికి లోబడి మార్పులు ఉండవచ్చని తెలిపారు. జిల్లాలో 40 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, పురుషులకు జూనియర్స్ లెక్చరర్ విభాగంలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటని, జువాలజీ, సివిక్స్ సబ్జెక్టులలో ఒక్కొక్క పోస్టు, పిజిటి విభాగంలో మ్యాథమెటిక్స్, బయోసైన్స్, సోషల్ స్టడీస్ లో ఒక్కొక్క పోస్టు, ఇంగ్లీష్ లో 2 పోస్టులు, టిజిటి విభాగంలో బయో సైన్స్ ఒక్క పోస్టు, పార్ట్ టైం హిందీ లో 4 పోస్టులు, ఆర్ట్ టీచర్ 2 పోస్టులు, లైబ్రరీ ఒక పోస్టు ఉన్నాయని తెలిపారు. మహిళలకు జూనియర్ లెక్చరర్ విభాగంలో ఇంగ్లీష్, కెమిస్ట్రీ, సివిక్స్ సబ్జెక్టులలో ఒక్కొక్క పోస్టు, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులో 2 పోస్టులు, పిజిటి విభాగంలో ఇంగ్లీష్, మ్యాథమెటిక్స్, ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టులలో ఒక్కొక్క పోస్టు, టిజిటి విభాగంలో మ్యాథమెటిక్స్, బయోలాజికల్ సైన్స్, సోషల్ స్టడీ లలో ఒక్కొక్క పోస్టు, హిందీ పార్ట్ టైం 4 పోస్టులు, పిఈటి, పిడి 2 పోస్టులు, మ్యూజిక్ టీచర్, క్రాఫ్ట్ టీచర్, లైబ్రరియన్, స్టాఫ్ నర్స్ లలో ఒక్కొక్క పోస్టు ఉన్నాయని తెలిపారు. జూన్ 27న లక్షెట్టిపేటలో నిర్వహించిన పార్ట్ టైం టీచర్స్ ఎంపిక డెమోకు హాజరైన వారు కూడా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# నేడు హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ ప్రారంభం..

## తొలి హైడ్రోజన్ రైలుకు మోదీ జెండా ఊపు

**హైదరాబాద్, జూలై 16**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జూలై 17న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణలోని హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌తో పాటు దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల్లో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద పునరాభివృద్ధి చేసిన 75 రైల్వే స్టేషన్లను ప్రారంభించనున్నారు. రూ.1,570 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసిన ఈ స్టేషన్లు ఆధునిక సౌకర్యాలు, స్థానిక సంస్కృతిని ప్రతిబింబించేలా రూపొందించబడ్డాయి. లతెలంగాణలో రూ.26 కోట్లతో అభివృద్ధి చేసిన హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ విమానాశ్రయ స్థాయి సౌకర్యాలు, ఆధునిక వసతులతో ఐటీ కారిడార్‌కు కీలక రవాణా కేంద్రంగా నిలవనుంది. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద తెలంగాణలో ఎంపికైన 40 స్టేషన్లలో ఇది ఒకటి. అదే కార్యక్రమంలో జింద్–సోనిపట్ మధ్య భారతదేశపు తొలి హైడ్రోజన్ ఇంధన రైలును కూడా ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో రూపొందిన ఈ 10 కోచ్‌ల రైలు 3,200 హెచ్‌పీ సామర్థ్యంతో పనిచేస్తూ పర్యావరణహిత, సుస్థిర రైల్వే రవాణాలో దేశానికి కొత్త మైలురాయిగా నిలవనుంది.

# స్త్రీ నిధి రుణాలతో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

## కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాల పల్లి, జూలై 16**

మహిళా సంఘాల సభ్యులు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్త్రీ నిధి రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి స్త్రీ నిధి సమీక్ష కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుణాలపై మహిళలకు పూర్తి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా స్త్రీ నిధి రుణాల మంజూరులో రాష్ట్రంలో మూడో స్థానంలో ఉన్నప్పటికీ, రికవరీలో 19వ స్థానంలో ఉందని పేర్కొంటూ పెండింగ్ వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. మహాముత్తారం, పలిమెల మండలాల్లో రుణాల పంపిణీ పెంచాలని, ఘన్పూర్, టేకుమట్ల మండలాల్లో నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకుని రికవరీ చేయాలని ఆదేశించారు.

# యాక్షన్ ప్లాన్ ప్రకారం ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల, జూలై 16**



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను యాక్షన్ ప్లాన్ ప్రకారం వేగవంతంగా పూర్తి చేసి, క్షేత్రస్థాయిలో ప్రతిరోజూ పురోగతిని పరిశీలించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. హౌసింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆమె, అర్హులైన లబ్ధిదారులకే పారదర్శకంగా ఇండ్లు మంజూరు చేయాలని, దశలవారీగా పూర్తైన ఇళ్లకు త్వరగా గృహప్రవేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే వన మహోత్సవం సందర్భంగా జిల్లాలో లక్ష్యానికి అనుగుణంగా మొక్కల నాటేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, గుంతలు తవ్వి మొక్కలను సిద్ధంగా ఉంచాలని సంబంధిత శాఖలను ఆదేశించారు.

# కేజీబీవీ విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేసిన కలెక్టర్




**వేములవాడ, జూలై 16**

మర్రిపల్లి కేజీబీవీలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని లక్ష్యాన్ని చేరుకోవాలని, చదువుతో పాటు ఆటలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం పాఠశాలలో ఆహార పదార్థాల నాణ్యత, మెనూ, పరిశుభ్రతను పరిశీలించి, విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

# కే. జీ. బి.వి విద్యాలయంలో జరుగుతున్న పనులు పరిశీలన



**కొడంగల్ మున్సిపల్, జులై,16**

వికారాబాద్ జిల్లా: కొడంగల్ మున్సిపాలిటీ లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జరుగుతున్నటువంటి పనులు మరియు అక్కడి సమస్యలు&సదుపాయాలు,అక్కడవిద్యార్థులకు ఇచ్చే ఆహార పదార్థాలు ఏ విధంగా ఉన్నాయో పరిశీలించిన కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ మరియు మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ అదేవిధంగా అక్కడ ఉన్న విద్యార్థులకు ఏ విధంగా ఇబ్బంది కలగకుండా అతితొందర్లోనే పనులు పూర్తి చేయాలని పని నిర్వాహకులకు తెలియపరచారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.స్రవంతి,తదితరులు ఉన్నారు.

# అక్రమ ఇసుక రవాణాదారిపై రూ. లక్ష బాండ్ ఫోర్ ఫీట్ చర్యలు

**కొత్తగూడెం, జూలై 15**

అక్రమ ఇసుక రవాణా కేసులో గతంలో బైండోవర్ చేసిన వ్యక్తి మళ్లీ అదే తరహా నేరానికి పాల్పడడంతో అతనిపై రూ.లక్ష బాండ్‌ను ఫోర్‌ఫీట్ చేసేందుకు పోలీసులు చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. పోలవరం జిల్లా యటపాక మండలం చింతలగూడెం గ్రామానికి చెందిన జేసీబీ యజమాని తిన్నబోయిన రవి కుమార్ గతంలో లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన అక్రమ ఇసుక రవాణా కేసులో నిందితుడిగా ఉన్నాడు. దీంతో ఒక సంవత్సరం పాటు మంచి ప్రవర్తనతో ఉండాలని బైండోవర్ చేసి, నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.లక్ష బాండ్ జప్తు చేసుకునేలా బాండ్ తీసుకున్నారు. అయితే అనంతరం భద్రాచలం పోలీస్ స్టేషన్ పరిధిలో మరో అక్రమ ఇసుక రవాణా కేసులో నిందితుడిగా నమోదవడంతో బైండోవర్ షరతులను ఉల్లంఘించినట్లు గుర్తించిన పోలీసులు, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు రూ.లక్ష బాండ్‌ను ఫోర్‌ఫీట్ చేసేందుకు చర్యలు చేపట్టారు. బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై, అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు హెచ్చరించారు.

# ఇన్ఫోసిస్ లో 250 చెల్లింపు ఇంటర్న్‌షిప్ లు

**మహబూబాబాద్, జూలై 16**

ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకం (PMIS) కింద హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్‌లో AI ఇంటర్న్, సాఫ్ట్‌వేర్ డెవలపర్ పోస్టులకు 250 చెల్లింపు ఇంటర్న్‌షిప్ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్, జిల్లా ఉపాధి అధికారి శ్రీమతి రాజిత తెలిపారు. ఎంపికైన వారికి ఆరు నెలల పాటు నెలకు రూ.9,000 స్టైపెండ్‌తో పాటు రూ.6,000 జాయినింగ్ గ్రాంట్ అందజేయనున్నారు. అర్హులైన B.E./B.Tech (2024–25, 2025–26) పట్టభద్రులు జూలై 18లోపు PMIS పోర్టల్‌లో నమోదు చేసుకుని దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

## జూలై 17న కరీంనగర్‌లో ప్రత్యేక పెన్షన్ అదాలత్

**కరీంనగర్, జూలై 16**

అకౌంటెంట్ జనరల్, హైదరాబాద్ కార్యాలయం ఆధ్వర్యంలో పెన్షన్, ప్రావిడెంట్ ఫండ్, అకౌంట్స్ అంశాలపై జూలై 17న ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రత్యేక పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు కలెక్టరేట్ ఏవో సుధాకర్ తెలిపారు. పూర్వ కరీంనగర్ జిల్లాకు చెందిన డీడీఓలు, పెన్షనర్లు తప్పనిసరిగా హాజరై పెన్షన్ సమస్యల పరిష్కారం, పీఎఫ్, అకౌంట్స్ అంశాలపై సందేహాల నివృత్తి, వార్షిక తనిఖీలో గుర్తించిన అభ్యంతరాల పరిష్కారం కోసం అవసరమైన పత్రాలతో ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## బాన్సువాడలో శారీరక దివ్యాంగుల కోసం ప్రత్యేక యూడీఐడీ (సదరం) క్యాంపు ప్రారంభం

**బాన్సువాడ, జూలై 16**

బాన్సువాడ డివిజన్‌కు చెందిన శారీరక దివ్యాంగుల సౌకర్యార్థం ప్రత్యేక యూడీఐడీ (సదరం) క్యాంపును స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఎస్పీ సంయుక్తంగా ప్రారంభించారు. జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే యూడీఐడీ సేవలు అందించేందుకు ఈ క్యాంపు ఏర్పాటు చేశారు. ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించగా, దివ్యాంగుల నమోదు, వైద్య మూల్యాంకనం తదితర ప్రక్రియలు సజావుగా పూర్తయ్యాయి. ఇకపై ప్రతి నెలలో రెండుసార్లు బాన్సువాడ డివిజన్‌లో ఈ ప్రత్యేక సదరం క్యాంపులు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఎస్పీ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రభుత్వ ఆసుపత్రి వైద్య బృందం, సంబంధిత శాఖల అధికారులకు డీఆర్‌డీఏ కామారెడ్డి కృతజ్ఞతలు తెలిపింది.

## కమిటీకి చట్టబద్ధత, జిల్లాల్లోనే సమీక్షలు నిర్వహించాలని ఉద్యమకారుల డిమాండ్



**హైదరాబాద్, జూలై 16 :**

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల ఉద్యమకారులు కమిటీకి చట్టబద్ధత కల్పించాలని, కమిటీ సభ్యులే జిల్లాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో గుర్తింపు ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే 250 గజాల ఇంటి స్థలం, నెలవారీ పెన్షన్, ఉద్యమకారుల పిల్లలకు విద్యా–ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, మహిళలకు ప్రత్యేక ప్రయోజనాలు, హెల్త్ కార్డులు, ఉచిత విద్య, ఆర్టీసీ ఉచిత ప్రయాణం కల్పించాలని కోరారు. ఉద్యమకారుల ప్రతిపాదనలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని కమిటీ సభ్యులు హామీ ఇచ్చారు. జూలై 22 వరకు ముఖాముఖి సమావేశాలు కొనసాగనున్నాయి.

## తెలుగు భాషను మన సంస్కృతిగా భావించి విద్యార్థులకు బోధించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య



**మంచిర్యాల, జూలై 16 :**

తెలుగు భాషను మన సంస్కృతిగా భావించి విద్యార్థులకు బోధించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు భాషా శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య మాట్లాడుతూ, తెలుగు భాషను కేవలం ఒక పాఠ్యాంశంగా కాకుండా మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా భావించి విద్యార్థులకు బోధించాలని తెలుగు భాష ఉపాధ్యాయులకు సూచించారు. శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న వినూత్న బోధనా పద్ధతులను పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థులలో తెలుగు భాషపై ఆసక్తి, అభిరుచిని పెంపొందించాలని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో ఇతర భాషల ప్రభావం కారణంగా విద్యార్థులకు తెలుగు భాషను సమర్థవంతంగా బోధించడం కొంత సవాలుగా మారిందని, ఈ పరిస్థితిని అధిగమించేందుకు తెలుగు ఉపాధ్యాయులు సృజనాత్మక బోధనా విధానాలను అవలంబించాలని తెలిపారు. ముఖ్యంగా కథలు, కవితలు, పద్యాలు, నాటికలు వంటి సాహిత్య ప్రక్రియలను ఉపయోగించి విద్యార్థులలో భాషా నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు, శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్సు కో– ఆర్డినేటర్ జంబోజు సత్తయ్య, శిక్షణ కేంద్ర ఇన్ చార్జి బోనగిరి శ్రీనివాస్, జిల్లా స్థాయి డీఆర్పి.లు, తెలుగు భాష ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సిఐటియు రాష్ట్ర సమావేశాలను జయప్రదం చేయండి

### తుర్కపల్లి సురేందర్

**వలిగొండ జూలై 16**



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ ఆగస్టు 16, 17, 18, తేదీల్లో పోరాటాల పురిటి గడ్డ భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగే సిఐటియు రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా సహాయకార్యదర్శి తుర్కపల్లి సురేందర్ కార్మికులకు పిలుపునిచ్చారు. గురువారం రోజున రాష్ట్ర సమావేశాల కరపత్రంను వలిగొండ మండలం దుప్పెల్లి గ్రామంలో భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం లో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చి కార్పొరేట్ శక్తులకు పెట్టుబడిదారులకు యాజమాన్లకు అనుకూలంగా మార్చిందని విమ ర్శించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలను సవరిస్తూ జీవో M. S.NO 6ను తీసుకువచ్చి జూన్ 1నుండి పెరిగిన కనీసవేతనాలు అమలు లోకి వస్తాయని ప్రకటించింది. వేతనాలసవరణ శాస్త్రియం గా లేదు. పెరిగిన ధరల కు అనుగుణంగా వేతనాలు పెరగలేదు. రాష్ట్రాన్ని మూడు జోన్లు గా, కార్మికులను నాలుగు కేటగిరి లుగా విభజించి ఒకొక్క జోన్లో ఒక్కో రకంగా వేతనాలు నిర్ణయించి అన్ని జోన్ లకు, అన్ని కేటగిరి లకు వి డి ఏ ఒకే విధంగా వర్తింప జెస్తున్నది. శాస్త్రి యం గా వేతనాలు ను సవరించి వెంటనే అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. ప్రభుత్వంవెంటనే భవన నిర్మాణ కార్మికుల కు హెల్త్ టెస్ట్ లను రద్దు చేసి, ఇన్సూరెన్స్ కంపెనీ లకు ఇచ్చిన స్కిం లను ఉపసంహరించు కోవాలి, హమాలీల కు వెల్ఫర్ బోర్డు ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ను కోరారు. ఈ కార్యక్రమం లో భవన నిర్మాణకార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాధారపు. మల్లేశం, కిష్టయ్య, శ్రీను, నర్సింహా, రాములు, మహేష్, రాజు, విజయ్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వేసవి కంప్యూటర్ శిక్షణా కార్యక్రమం

### విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవం

**కొడంగల్ మున్సిపల్, జులై,16**




కొడంగల్ లోని ఏఎస్ కంప్యూటర్స్ ఆధ్వర్యంలో వేసవి కాలంలో కంప్యూటర్ శిక్షణ పొందిన 120 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా, ఉత్తీర్ణులైన విద్యార్థులకు గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొడంగల్ ఎస్సై జి. వి. సత్యనారాయణ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి ,వైస్ ప్రిన్సిపాల్ మధుసూదన్ రెడ్డి ,కంప్యూటర్ ఇన్ స్పెక్టర్ మహేశ్వర్ రెడ్డి, ల్యాబ్ ఇన్ చార్జ్ స్వాతి,సెంటర్ డైరెక్టర్ అన్నపూర్ణ,పద్మనాభ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కొడంగల్ ఎస్సై జి. వి.సత్యనారాయణ మాట్లాడుతూ, నేటి కాలంలో చదువుతో పాటు టెక్నికల్ స్కిల్స్ మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) పై అవగాహన ప్రతి విద్యార్థికి ఎంతో అవసరమని తెలిపారు. భవిష్యత్తులో ఏ ఉద్యోగం పొందాలన్నా కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి అవుతుందని పేర్కొన్నారు.అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి మాట్లాడుతూ, ప్రతి విద్యార్థికి కంప్యూటర్ పరిజ్ఞానం అత్యంత అవసరమని, రానున్న రోజుల్లో చిన్న ఉద్యోగానికి కూడా కనీస కంప్యూటర్ నైపుణ్యాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఏఎస్ కంప్యూటర్స్ లో శిక్షణ పొందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును మరింత మెరుగుప రచుకోవాలని అభినం దించారు.ఈ కార్యక్రమంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందనలు తెలియజేశారు.

## ఆదుకునేందుకే 'ఆపద మిత్ర' శిక్షణ: కలెక్టర్ రాజర్షిషా

**ఆదిలాబాద్, జూలై 16 :**



విపత్తుల సమయంలో అత్యవసర సహాయక చర్యలకు యువత సిద్ధంగా ఉండేలా 'ఆపద మిత్ర' శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. టిటిడిసిలో కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 40 మంది విద్యార్థులు శిక్షణ పొందారని, వరదలు, అగ్నిప్రమాదాలు, భూకంపాలు వంటి విపత్తుల సమయంలో తక్షణ స్పందనకు ఈ శిక్షణ దోహదపడుతుందని తెలిపారు. విపత్తు నిర్వహణకు అవసరమైన ఆధునిక పరికరాలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారులు, శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీతమ్మసాగర్–సీతారామ ప్రాజెక్టుల పనులు వేగవంతం.. 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యం

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 16**



ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సీతమ్మసాగర్ బ్యారేజ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను పూర్తిస్థాయిలో అందించాలని అధికారులను ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ గోదావరి జలాలను గరిష్టంగా వినియోగించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని, సీతమ్మసాగర్, సీతారామ, దేవాదుల ప్రాజెక్టులను సమన్వయం చేసి రైతులకు సాగునీరు అందిస్తామని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు పూర్తయితే సుమారు 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, న్యాయపరమైన సమస్యలను పరిష్కరించి పనులు వేగవంతం చేస్తామని చెప్పారు. ప్రాజెక్టులోని పంప్‌హౌస్‌లు, కాలువలు, విద్యుత్ అనుసంధాన పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టు కోసం ఇప్పటికే రూ.1,000 కోట్లకు పైగా నిధులు విడుదల చేశామని, గోదావరి జలాలు వృథా కాకుండా పంపింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం మంత్రులు మారెళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని కూడా పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

## కరువుతో ఇబ్బంది పడుతున్న రైతులకు విద్యుత్ కోతలను నివారించాలి

### సిపిఎం డిమాండ్

**వలిగొండ జూలై 16**



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వర్కట్పల్లి విద్యుత్ కోతలను నివారించాలని 18 గంటల విద్యుత్ ను అందించాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. గురువారం రోజున మండల పరిధిలోని వర్కట్ పల్లి గ్రామంలో సబ్ స్టేషన్ ముందు విద్యుత్ కోతలను నివారించాలని, 18 గంటల విద్యుత్ ను అందించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ ఒకవైపు వర్షాలు లేక మరొకవైపు మూసి కాలువల ద్వారా నీరు రాకపోవడంతో గ్రౌండ్ వాటర్ తగ్గి బోర్లలో నీళ్ళు లేక రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న ఈ సమయంలో 2-3 గంటల పాటు విద్యుత్తు అందించకపోవడం వల్ల బోర్లపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులు తమ పంట పొలాలు ఎండిపోతున్నాయని తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని వెంటనే విద్యుత్ శాఖ అధికారులు ప్రభుత్వం విద్యుత్ కొతలను నివారించేందుకు తక్షణ చర్యలను చేపట్టాలని అదనపు విద్యుత్తును అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి గూడూరు బుచ్చిరెడ్డి, మెట్టు రవీందర్ రెడ్డి, చేగురి నరసింహ, ఆకుల మారయ్య, మాదుగుల వెంకటేశం, రోండి మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

చురకలు



# సామాజిక-ఆర్థిక అభివృద్ధిలో నాబార్డ్ కీలక పాత్ర పోషిస్తూ దేశ అభివృద్ధికి అండగా నిలుస్తోంది

**జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక.**

**నారాయణపేట, జులై,16**




గ్రామీణాభివృద్ధి, వ్యవసాయాభివృద్ధి సమగ్ర సామాజిక–ఆర్థిక అభివృద్ధిలో నాబార్డ్ ఎల్లప్పుడూ కీలక పాత్ర పోషిస్తూ దేశ అభివృద్ధికి అండగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రీఫైనాన్సింగ్, రైతులకు ఆర్థిక సహాయం, మహిళా సంఘాలకు ఫైనాన్షియల్ సపోర్ట్, నేచురల్ ఫార్మింగ్ ప్రోత్సాహం వంటి అనేక రంగాల్లో నాబార్డ్ ఎంతో విశేషమైన సేవలు అంది స్తోందన్నారు. నా బార్డ్ డే సందర్భంగా గురువారం జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..నారాయణపేట జిల్లాలో కూడా నాబార్డ్ ఇటీవల తన కార్యకలాపాలను మరింత విస్తరించడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. మనలాంటి గ్రామీణ జిల్లా అభివృద్ధికి నాబార్డ్ వంటి సంస్థలు చేరువ కావడం ఎంతో అవసరం అని తెలిపారు. స్వయం సహాయక సంఘాల (SHGs) సభ్యులు నాబార్డ్ అందిస్తున్న అభివృద్ధి అవకాశాలు, పథకాలను పూర్తిగా సద్వినియోగం చేసుకుని తమ జీవనోపాధిని మరింత మెరుగుపరచుకోవాలని ఆమె సూచించారు. దేశంలో ఎన్నో ఆర్థిక సంస్థలు ఉన్నప్పటికీ, గత 45 సంవత్సరాలుగా గ్రామీణ ప్రజలకు నమ్మకమైన భాగస్వామిగా నాబార్డ్ సేవలందిస్తోందన్నారు. జిల్లా అభివృద్ధికి సంబంధించిన ఏ సమావేశం జరిగినా, జిల్లా కలెక్టర్ పిలుపు వచ్చిన వెంటనే స్పందిస్తూ, "మేము సిద్ధంగా ఉన్నాం... అవసరమైతే డీపీఆర్‌లు తయారు చేస్తాం... మా వద్ద నిధులు ఉన్నాయి... జిల్లాకు అవసరమైన సహకారం అందిస్తాం" అనే సానుకూల దృక్పథంతో నాబార్డ్ అధికారులు ఎప్పుడూ ముందుంటున్నారని ఆమె పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఈ సహకారం మరింత బలపడాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నానని అన్నారు. ముఖ్యంగా మన జిల్లా మహిళలకు నా బార్డ్ సంస్థలు సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నప్పుడు, మనం కూడా ముందుకు రావాలని, మనం ఏం చేయగలం? మన గ్రామాల్లో ఏ అవకాశాలు ఉన్నాయి? ఏ వ్యాపారాలు ప్రారంభించవచ్చు? అనే విషయాల్లో ధైర్యంగా ముందుకు రావాలని మహిళా సంఘాల సభ్యులకు ఆమె సూచించారు. సంఘాలతో నిరంతరం అనుసంధానంగా ఉండాలని, రుణం తీసుకోవడమే కాకుండా ఆ రుణాన్ని సరైన విధంగా ఉపయోగించి మరింత ఆదాయం వచ్చేలా వ్యాపారాన్ని విస్తరించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సబ్సిడీలు, ఇతర అవకాశాలను కూడా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. నా బార్డ్ అందించబోయే ప్రెజెంటేషన్‌లో కూడా ఈ అంశాల గురించి వివరంగా తెలియజేస్తారనీ, అందరూ శ్రద్ధగా విని, ఎలాంటి సహాయం అవసరమైనా నాబార్డ్ సంస్థ ద్వారా, అలాగే సంబంధిత ప్రభుత్వ శాఖల ద్వారా తాము ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం "కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలి" అనే లక్ష్యంతో పనిచేస్తోందనీ, అలాగే నారాయణపేటను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని, ఆ మహత్తర లక్ష్య సాధనలో నాబార్డ్ తన సహకారం,మార్గదర్శకత్వాన్ని మరింతగా అందించాలని, ఆ లక్ష్య సాధనలో మనమందరం భాగస్వాములు కావాలని రాబోయే రోజుల్లో కూడా ఇదే ఉత్సాహంతో, చురుకుదనంతో ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు.అనంతరం స్వయం సహాయక సంఘాల బలోపేతం మహిళా పారిశ్రామిక వేత్తల అభివృద్ధి విజయ గాథల గురించి ట్రైనీ శ్రీనివాస్ వివరించారు. ఈ కార్యక్రమంలో డీ ఆర్డీవో వెంకట్ రాములు, నాబార్డు డీ డీ మహేందర్ బాబు, ఎల్ డి ఎం విజయ్ కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్, ఉద్యాన శాఖ జిల్లా అధికారి సాయిబాబా, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, కార్యదర్శి పద్మమ్మ, కోశాధికారి అంజమ్మ, మున్సిపల్ కమిషనర్ శంకర్, డీ పీ ఎం లు, ఏ పీ ఎం లు, తదితరులు పాల్గొన్నారు.

## నారాయణపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిభా పురస్కారాల సన్మాన కార్యక్రమం

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ హుల్ హాక్**

**నారాయణపేట,జులై,16**



నారాయణపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల ప్రతిభా పురస్కారాల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. గత విద్యాసం వత్సరంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవ త్సరంలో అత్యుత్తమ మార్కులు సాధించిన టాపర్లకు, అలాగే ద్వితీయ సంవత్సరం పూర్తి చేసుకొని టీటీసీ (TTC) ప్రవేశ పరీ క్షలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యా ర్థులకు ఈ సందర్భంగా ఘనంగా సన్మానం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అడిషనల్ ఎస్పీ విచ్చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మరియు జిల్లా అధికారి అయిన హెచ్. సుదర్శన్ రావు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.విద్యార్థులకు ప్రోత్సాహం – బహుమతుల ప్రదానం కార్యక్రమంలో భాగంగా డాక్టర్ రవీందర్ లకావత్ విద్యార్థులకు మెమెంటోలు, ప్రత్యేక బహుమతులను అందజేసి అభినందించారు.విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, జీవితంలో స్థిరపడాలనే ఉద్దేశంతో ఈ ప్రోత్సాహక బహుమతులను అందించడం జరిగిందని వారు తెలిపారు.వక్తల సందేశం:స్ఫూర్తిగా నిలవాలి: సన్మానం పొందిన విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకుని, తోటి విద్యార్థులు కూడా రాబోయే ఇంటర్మీడియట్ పరీక్షల్లో మరియు పోటీ పరీక్షల్లో (Competitive Exams) అత్యుత్తమ ఫలితాలు సాధించాలని పిలుపు నిచ్చారు.ఉజ్వల భవిష్యత్తు: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకుంటే వారి భవిష్యత్తు ఎంతో ఉజ్వ లంగా ఉంటుందని వక్తలు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సంగెం హై లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించిన భువనగిరి ఎమ్మెల్యే

**కుంభం అనిల్ కుమార్ రెడ్డి.**

**వలిగొండ జులై 16**



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం–బోలేపల్లి గ్రామాల మధ్య మూసి నదిపై నిర్మించనున్న సంగెం హై లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. పనులు ప్రారంభించే ముందు భీమలింగం కట్ట వద్ద శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యేగా ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి తగిన విధంగా నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న ఈ హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే సంగెం, బోలేపల్లి గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు అన్ని కాలాల్లో సురక్షితమైన రాకపోకలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. సుమారు రూ.50కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ బ్రిడ్జికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పరిపాలనా ఆమోదం తెలుపుతూ నిధులు మంజూరు చేశారని, రాష్ట్ర రోడ్లు & భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక చొరవతో పనులు ప్రారంభమయ్యేలా సహకరించారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ఈ బ్రిడ్జి శంకుస్థాపన కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని, ప్రస్తుతం నిర్మాణ పనులను ప్రారంభించామని ఎమ్మెల్యే వెల్లడించారు. భువనగిరి నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈ ఈ ఆర్&బి సరితారాణి, భువనగిరి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ తోటలను దందర్శించి, ఆయిల్ పామ్ క్షేత్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

**దీపక్ తివారీ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ భరద్వాజ్**

**ధారూర్ మండలం,జులై,16**



జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, IAS, జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ భరద్వాజ్, IAS , ధారూర్ మండలంలోని తరిగొప్పుల గ్రామానికి చెందిన చర్ల శ్రీనివాస్ రెడ్డి, వీరా రెడ్డి, రాజేందర్ రెడ్డి ఆయిల్ పామ్ తోటలను గురువారం సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ క్షేత్రాన్ని పరి శీలించారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలు, అధిక ఆదాయం, మార్కెట్ భరోసా వంటి అంశాలపై రైతులతో మాట్లాడి, ఆయిల్ పామ్ సాగును మరింత విస్తరించాలని సూచించారు.ఈ సందర్భంగా ప్రతి మండలానికి 1,000 ఎకరాల లక్ష్యంతో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు సంబంధించిన కార్యక్రమాలను అధికారులు చేపట్టాలని సూచించారు. పండించిన రైతులకు ఆయిల్ పామ్ కంపెనీ ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంట సేకరణ, రవాణా, చెల్లింపులు సకాలంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని, అలాగే రైతులకు అవస రమైన సాంకేతిక సూచనలు ఎప్పటి కప్పుడు అందించాలని సంబంధిత అధికా రులను ఆదేశించారు.ఈ సందర్భంగా el-nino ప్రభావం కారణంగా వర్షాలు తక్కువగా ఉండే అవకాశం ఉండటం వల్ల తక్కువ వ్యవధిలో అధిక ఆదాయం పొందే పంటలు అయిన కూరగాయలు, పూల తోటలు, ఔషధ మొక్కలు, పండ్ల చెట్లు వేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన & పట్టు పరిశ్రమల అధికారి ఎం.ఏ. సత్తార్, ఉద్యాన అధికారి యమునా ఎం., మండల రెవెన్యూ అధికారి శంకర్, ఎంపిడివో, సర్పంచ్, ఉపసర్పంచ్, ఎంపీటీసీ, HEO, అంగన్‌వాడీ సిబ్బంది, ఈకోపామ్ గ్రామ ప్రతినిధులు, EPC ఫీల్డ్ ప్రతినిధులు మరియు రైతులు పాల్గొన్నారు.

## రహదారి నియమాల పాటనే ప్రమాదాల నివారణకు మార్గం: కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాల పల్లి , జూలై 16**

: రహదారి నియమాలను కచ్చితంగా పాటిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా చూడాలని సూచించారు. ప్రమాదకర ప్రాంతాల్లో భద్రతా చర్యలు చేపట్టాలని, ప్రమాద బాధితులను గంటలోపు ఆసుపత్రికి తరలించిన వారికి 'రహవీర్ అవార్డు'తో పాటు రూ.25 వేల ప్రోత్సాహకం అందజేస్తామని తెలిపారు. అలాగే పీఎం రాహత్ పథకం ద్వారా ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు నగదు రహిత వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిబంధనల మేరకు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ**



**వికారాబాద్, జులై,16**

వికారాబాద్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిబంధనల మేరకు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు.గురువారము వీడియో కాన్ఫరెన్సు హాలు నుండి అన్ని మండలాల తహసిల్దార్లు మరియు మున్సిపల్ కమిషనర్ లతో జూమ్ సమావేశము నిర్వహించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఆగష్టు 3 వ తేది వరకు ఎన్నికల కమిషన్ పొడిగించినందున ,ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మండల తహసీల్దార్లను ఆదేశించారు.ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరును నమోదు చేయడం, అనర్హుల పేర్లను నిబంధనల ప్రకారం తొలగించడం, మార్పులు, చేర్పులు, సవరణలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు.బూత్ లెవల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఇంటింటి ధృవీకరణను సమర్థవంతంగా నిర్వహించాలని, ఓటర్ల నుంచి వచ్చే దరఖాస్తులను సకాలంలో పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని తెలిపారు.ఎలాంటి ఫిర్యాదులకు తావు లేకుండా పూర్తి పారదర్శకతతో విధులు నిర్వహించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా మండలం వారిగా పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ జూమ్ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, డి ఆర్ ఓ స్వర్ణ లత , ఆర్ డి ఓ వాసుచంద్ర, మున్సిపల్ కమిషనర్ విక్రం సింహ రెడ్డి, ఎన్నికల విభాగం సుపరింతెన్డెంట్ నేమత్ హాలి, మండల తహసీల్దార్లు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## తబ్లిక్-ఎ-జమాత్ ఇస్తామా కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు: షబ్బీర్ అలీ హామీ

**హైదరాబాద్, జూలై 16 (సమయం న్యూస్,)**

పాతబస్తీలోని సాయిన్ నగర్‌లో ఈ నెల 25 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే తబ్లిక్–ఎ–జమాత్ ఇస్తామా కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 3 వేల మంది పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి వచ్చే భక్తులకు కనీస మౌలిక సదుపాయాలు, రవాణా సౌకర్యాలు కల్పించాలని తబ్లిక్–ఎ–జమాత్ మత పెద్దలు ఇసాక్, మహ్మద్ మదిన్, అబ్దుల్ ఖాదర్, మొయిన్ తదితరులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వెంటనే ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఐపీఎస్‌తో మాట్లాడిన షబ్బీర్ అలీ, కార్యక్రమానికి వచ్చే వారికి రవాణా సౌకర్యాలు కల్పించాలని కోరారు. దీనికి స్పందించిన ఆర్టీసీ ఎండీ, సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్లు, ఇమ్లిబన్ బస్ స్టేషన్‌ల నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడిపిస్తామని హామీ ఇచ్చారు.

## జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డీఈవో చైతన్య జైనీ

**కరీంనగర్, జూలై 16**



కరీంనగర్ జిల్లా విద్యాశాఖ అధికారిగా (డీఈవో) నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైతన్య జైనీ గురువారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను ఆమె ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూల బొకే అందజేశారు. జిల్లాలో విద్యా ప్రమాణాల మెరుగుదలతో పాటు ప్రభుత్వ విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ చైతన్య జైనీకి సూచించారు. ఈ సమావేశంలో ఇప్పటివరకు ఇన్‌చార్జి డీఈవోగా విధులు నిర్వహించిన విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రశాంత్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

చురకలు





# తుర్రేబాజ్ ఖాన్ పోరాటం స్ఫూర్తి దాయకం

## 1857 జూలై 17... తురేబాజ్ ఖాన్ నాయకత్వంలో బ్రిటిష్ రెసిడెన్సీపై దాడి జరిగిన దినం

భారత ప్రథమ స్వతంత్ర సంగ్రామంగా పేరెన్నిక గన్న 1857 సిపాయిల తిరుగుబాటు ఉత్తర భారతావనిలో ప్రారంభం అయినా దాని ప్రభావం దక్షిణ భారతదేశానికీ విస్తరించింది. ఈ తిరుగు బాటుకు నిజాం పరిపాలనా ప్రాంతమైన హైదరాబాద్ కు సంబంధాన్ని సూచించే చారిత్రక అంశమే తుర్రేబాజ్ ఖాన్ మార్గదర్శక జీవితం. ఆధునిక మారణ ఆయుధాలు కలిగి, అపారమైన సైనిక బలగాలున్న బ్రిటీష్ వారికి ఎదుర్కోవడం, ఎదురొడ్డి పోరాడడం ఆత్మహత్యా సదృశమని తెలియని వారుండరంటే అతిశయోక్తి కానేరదు. పోరు బాటలో మరణం పాలకులను తరిమి కొట్టేందుకు నడుం కట్టి, ఆయుధం చేతపట్టి, కదన రంగాన్ని ఎన్నుకుని పోరాడి అసువులు బాసి, అమరులైన పోరాట యోధులలో పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ ఒకడు. అందుకే చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయాడు. పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ పరాక్రమాలకు పెట్టింది పేరైన రొహిల్లా సైనిక పటాలానికి చెందిన నాయకుడు. ప్రఖ్యాతి చెందిన అరబ్బులు, రొహిల్లాలు గల సైనిక దళానికి నాయకత్వం వహించిన తుర్రేబాజ్ ఖాన్, హైదరాబాద్ నివాసి పఠాన్ రుస్తుం ఖాన్ కుమారుడు. ఆయన బ్రిటిషు సైన్యంలో చేరి ఔరంగాబాదు బ్రిటీష్ కంటోన్మెంటులో జమేదారుగా పని చేశాడు.

1857లో మీరట్ లో ప్రారంభమైన తిరుగుబాటు బావుటా హైదరాబాద్ కు చేరడంతో... హైదరాబాద్లో తుర్రేబాజ్ ఖాన్, మౌల్వీ అల్లావుద్దీన్ నేతృత్వంలో జరిగిన తిరుగుబాటు, రెసిడెన్సీలో ఖైదీగా ఉన్న జమేదార్ చీదా ఖాన్ను విడిపించడానికి అవసర మైనది. చరిత్రాత్మక మక్కా మసీదు నుండి బయలుదేరి, బ్రిటిష్ ఆధిప త్యానికి చిహ్నమైన హైదారాబాద్ రెసిడెన్సీ మీద సుమారు ఐదు వందల మంది సాహసికులతో 1857జూలై 17న సాహసోపేతమైన దాడి చేశారు. రెసిడెన్సీ గోడకు సమీపంలో ఉన్న రెండు ఇళ్లను ఖాళీ చేయించి అందులో నుంచి గోడను ధ్వంసం చేసి రెసిడెన్సీలోకి ప్రవేశించారు. వీరి వెంట ఐదు వేలకు పైగా రొహిల్లాలు, అరబ్లు, విద్యార్థులు, ఇతర సామాన్యులూ ఉన్నారు. కానీ, దాడి గురించిన సమాచా రాన్ని నిజాం మంత్రి తురబ్ అలీ ఖాన్ బ్రిటీషర్లకు చేర వేయడంతో గోడను ధ్వంసం చేసి రెసిడెన్సీలోకి తుర్రెబాజ్ సారథ్యంలో తిరుగు బాటు దారులు ప్రవేశించగానే బ్రిటీష్ సైన్యం సాయుధులై ప్రతిదాడికి సిద్ధంగా ఉన్నారు. జులై 17 సాయంత్రం ఆరు.. ఏడు గంటల ప్రాంతంలో మొదలైన ఈ పోరాటం తెల్లవారు జామున నాలుగు గంటల వరకు జరిగింది.

దాడిలో పలువురు సహచరులను కోల్పోయిన ఖాన్, బ్రిటిష్ – నిజాం బలగాలకు 1857 జూలై 22న పట్టు బడ్డారు. ఆయనకు ప్రభుత్వం ద్వీపాంతరవాస శిక్ష విధించి, యావదాస్తిని పాలకులు స్వాధీనం చేసుకున్నారు. కాపలాగా పెట్టిన సెంట్రీలలో కూడా మాతృభూమి పట్ల అభిమానాన్ని ప్రేరేపించి, వారి సహకారంతో 1859 జనవరి 18న జైలు నుండి తప్పించు కున్నాడు. ఆగ్రహించిన ప్రభుత్వం తుర్రేబాజ్ ఖాన్ను పట్టితెచ్చిన వారికి 5వేల రూపాయల నగదు నజరానాను జనవరి 19న ప్రకటించింది. నిజాం నవాబు ప్రకటించిన నజరానాకు ఆశపడిన కుర్బాన్ అలీ అనే నమ్మక ద్రోహి తుర్రేబాజ్ ఖాన్ ఆచూకిని బహిర్గతం చేశాడు. ఆ సమాచారంతో 1859 జనవరి 24న, మెదక్ జిల్లాలోని తూఫ్రాన్ అను గ్రామం మీద నిజాం, బ్రిటిష్ సైన్యాలు విరుచుకు పడ్డాయి. పోరాటంలో శత్రువు తుపాకి గుండ్లకు తుర్రేబాజ్ ఖాన్ గురైనాడు. తరువాత ఆ యోధుని మృత దేహాన్ని బ్రిటిషు సైన్యాలు హైదారాబాద్ కు తరలించాయి. ఆయన భౌతిక కాయానికి అంత్య క్రియలు జరపకుండా ఇనుప సంకెళ్ళతో కట్టేసి ప్రస్తుతం సుల్తాన్ బజారు పోలీసు స్టేషన్ ఉన్న చోట, ఇలాంటివి పునరావృతం కాకుండా, స్థానికుల్లో భయాందోళనలు కలిగించేందుకు బహిరంగంగా వేలాడ దీశారు. స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర పుటలలో స్థానం పొంది అమరుడై, చిరస్మరణీయుడైన తుర్రేబాజ్ ఖాన్ పఠాన్, శ్రీ మౌల్వీ అల్లావుద్దీన్ తదితర యోధుల దాడి సంఘటనలకు గుర్తుగా, వీరయోధుల స్మారకార్థం, హైదరాబాదు నగరం నడి బొడ్డున గల కోటిలోని సిటీ బస్టాండు వద్ద (అది అనాటి రెసిడెన్సీ ప్రాంతం) స్వతంత్ర భారత ప్రభుత్వం 1957లో స్మారక స్థూపాన్ని నిర్మించింది. అలాగే కోటి విమెన్స్ కాలెజీ నుంచి పుల్లి బౌలీ ఎక్స్ రోడ్ వరకు ఉన్న దారికి తుర్రెబాజ్ ఖాన్ పేరు పెట్టారు. కానీ, దాన్ని ఆ పేరుతో వ్యవహరించడం మరిచి పోవడం జరిగింది. స్థానిక పోరాట యోధుడి గురించి స్మరించడం, పాఠ్యాంశాల్లో చేర్చడం, భావి తరాలకు తెలియ చేయడం అత్యవసరం.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# లక్ష్యానికి దూరంగా క్రిమినల్ కోర్టు

## నేడు ప్రపంచ అంతర్జాతీయ న్యాయ దినోత్సవం

**న్యాయం కోసం ప్రపంచ పోరాటం... ఇంకా అసంపూర్తే!**

**లక్ష్యానికి దూరంగా అంతర్జాతీయ క్రిమినల్ న్యాయస్థానం**

**యుద్ధ నేరాలు, మానవత్వంపై దాడులకు శిక్షే లక్ష్యం.. కానీ సహకార లోపంతో ఆశించిన ఫలితాలు కరువు**

**అమెరికా ఆంక్షలు, సభ్య దేశాల నిరాసక్తతతో ఐసీసీ పనితీరుపై ప్రశ్నలు**

**ఒక్క అమాయకుడికి కూడా అన్యాయము జరగకూడదన్న సూత్రము న్యాయ వ్యవస్థకు పునాది. అంతర్జాతీయ న్యాయ దినోత్సవం, అనేది "అంతర్జాతీయ క్రిమినల్ జస్టిస్ దినోత్సవం" అని కూడా పిలువ బడుతుంది. దీనిని ప్రపంచ వ్యాప్తంగా జూలై 17 న జరుపుకుంటారు.**



యుద్ధ నేరాల ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజకీయ నేతలపై విచారణ జరిపేందుకు ఒక అంతర్జాతీయ న్యాయస్థానం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను మొట్టమొదటిసారి 1919లో జరిగిన పారిస్ శాంతి సదస్సులో కమిషన్ ఆఫ్ రెస్పాన్సిబిలిటీస్ తెరపైకి తీసుకొచ్చింది. లీగ్ ఆఫ్ నేషన్స్ ఆధ్వర్యంలో నవంబరు 1–16, 1937 మధ్య జెనీవాలో జరిగిన సదస్సులో ఈ అంశాన్ని మరోసారి ప్రస్తావించారు. రెండో ప్రపంచ యుద్ధం సందర్భంగా చోటుచేసుకున్న దురాగతాలపై విచారణ జరిపేందుకు ఒక శాశ్వత అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని 1948లో మొదటిసారి ఐక్యరాజ్య సమితి సాధారణ సభలో గుర్తించారు.

రెండో ప్రపంచ యుద్ధం తరువాత నాజీ యుద్ధ నేరాలపై దర్యాప్తు జరిపిన ఒక పరిశోధకుడు, న్యూరెంబర్గ్లో అమెరికా అధికారిక యంత్రాంగం జరిపిన పన్నెండు సైనిక విచారణల్లో ఒకటైన ఐన్శాట్జ్గ్రూపెన్ విచారణలో అమెరికా సంయుక్త రాష్ట్రాల ఆర్మీ ప్రధాన న్యాయవాదిగా వ్యవహరించిన బెంజమిన్ బి. ఫెరెంజ్... ఒక అంతర్జాతీయ చట్ట పాలన, ఒక అంతర్జాతీయ క్రిమినల్ న్యాయ స్థానం ఏర్పాటుకు ప్రధాన మద్దతుదారుగా మారారు. 1975లో ప్రచురించిన 'డిఫైనింగ్ ఇంటర్నేషనల్ అగ్రెషన్ – ది సెర్చ్ ఫర్ వరల్డ్ పీస్' అనే తన మొదటి పుస్తకంలో, ఒక అంతర్జాతీయ న్యాయస్థానం ఏర్పాటు కోసం వాదించారు. అలా ఒక శాశ్వత అంతర్జాతీయ న్యాయస్థానాన్ని సృష్టించాలని ప్రతిపాదన రావడంతో, 1989లో ఈ ఆలోచనకు రూప కల్పన చేసేందుకు, ముసాయిదాను తయారు చేసేందుకు నడుం బిగించ బడింది. యుగోస్లావియా, రువాండాల్లో యుద్ధ నేరాలపై విచారణ జరిపేందుకు న్యాయస్థానాలు తొలుత ఏర్పడ్డాయి. దీంతో ఒక శాశ్వత అంతర్జాతీయ క్రిమినల్ న్యాయస్థానం ఏర్పాటు అవసరం మరింత ప్రాధాన్యత పొందింది. ఇందుకు సంబంధించి ఒక ఒప్పందాన్ని ఖరారు చేసే లక్ష్యంతో ఐక్య రాజ్య సమితి సాధారణ సభ జూన్ 1998లో రోమ్ నగరంలో ఒక సదస్సును ఏర్పాటు చేసింది. 21 దేశాలు ఈ ఓటింగ్కు దూరంగా ఉన్నాయి. ఒప్పందానికి చైనా, ఇరాక్, ఇజ్రాయెల్, లిబియా, ఖతర్, యునైటెడ్ స్టేట్స్, యెమెన్ ఏడు దేశాలు వ్యతిరేకంగా ఓటు వేశాయి. జూలై 17, 1998న అంతర్జాతీయ క్రిమినల్ న్యాయ స్థానం రోమ్ శాసనం, 120 – 7 ఓట్ల తేడాతో ఆమోదిం చబడింది. ఇదే రోజున అంతర్జాతీయ న్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. ఏప్రిల్ 11, 2002న రోమ్ శాసనం సభ్య దేశాల ఆమోదంతో ఒక బంధన ఒప్పందంగా మారింది. శాసనం న్యాయబద్ధంగా జులై 1, 2002 నుంచి అమల్లోకి వచ్చింది. ఐసీసీ (ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు) కు ఆ రోజు తరువాత జరిగిన నేరాలపై మాత్రమే విచారణ జరిపే అధికారాన్ని కల్పించారు. 18 మంది న్యాయమూర్తులతో కూడిన మొదటి ధర్మాసనాన్ని సభ్యదేశాల సభలో ఫిబ్రవరి 2003లో ఎన్నుకోవడం జరిగింది. ఈ న్యాయమూర్తులు మార్చి 1, 2003న న్యాయస్థాన ప్రారంభ సెషన్లో ప్రమాణ స్వీకారం చేశారు.

అంతర్జాతీయ న్యాయస్థానం, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు రెండూ వేరు వేరు సంస్థలు. వీటి రెండిటికీ పరిధి ఉంది. అంతర్జాతీయ న్యాయస్థానం లేదా ప్రపంచ న్యాయస్థానం ఐక్యరాజ్యసమితి ప్రాథమిక న్యాయ అంగంగా నెదర్లాండ్ లోని హేగ్ నగరంలోగల, శాంతి సౌధం లో యున్నది. దీని ప్రధాన కార్యక్రమం, సభ్యదేశాల ద్వారా సమర్పించబడిన "న్యాయపర వాదనలు" ఆలకించడం, తీర్పు చెప్పడం. అయితే దీని యొక్క విచారణలు ఎక్కడైనా జరగవచ్చు. ఆగస్టు 2010 నాటికి, 113 దేశాలు న్యాయస్థానంలో సభ్య దేశాలయ్యాయి, దాదాపుగా అన్ని ఐరోపా మరియు దక్షిణ అమెరికా దేశాలు, ఆఫ్రికాలోని సగం దేశాలు ఇప్పుడు దీనిలో సభ్య దేశాలుగా ఉన్నాయి. మానవాళి చరిత్రలో మొట్టమొదటిసారి, ఒక అంతర్జాతీయ న్యాయస్థానానికి ఒక వ్యక్తికి నష్టపరిహారాన్ని మరో వ్యక్తి చెల్లించాలని ఆదేశించే అధికారాన్ని కల్పించారు. ఒక అంతర్జాతీయ న్యాయస్థానానికి ఇటువంటి అధికారం కల్పించడం కూడా ఇదే మొదటిసారి.

కనీసం 139 దేశాల్లో అనుమానిత నేరాల గురించి న్యాయస్థానానికి ఫిర్యాదులు అందాయి. న్యాయస్థానం ఐదు కేసులపై విచారణలు ప్రారంభించింది: ఉత్తర ఉగాండా, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, డార్ఫూర్ (సూడాన్) మరియు రిపబ్లిక్ ఆఫ్ కెన్యా కేసులపై ఈ న్యాయస్థానం విచారణలు చేపట్టింది. న్యాయస్థానం పదహారు మంది వ్యక్తులను దోషులుగా నిర్ధారించింది. వీరిలో ఏడుగురు పరారీలో ఉండగా, ఇద్దరు మరణించారు (లేదా మరణించినట్లు విశ్వసిస్తున్నారు), నలుగురు నిర్బంధంలో ఉన్నారు. ముగ్గురు స్వచ్ఛందంగా న్యాయస్థానం ఎదుట లొంగి పోయారు. 2007 అక్టోబరు 4నాటికి కనీసం 139 దేశాల్లో అనుమానిత నేరాలకు సంబంధించి విచారణకర్తకు 2889 సమాచారాలు వచ్చాయి. అయితే ప్రాథమిక సమీక్ష తరువాత, ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదులను న్యాయస్థానం యొక్క అధికార పరిధికి వెలుపల ఉన్న పరిస్థితులుగా గుర్తించి తోసిపుచ్చడం జరిగింది.

ఐసిసికి 123 సభ్య దేశాల మద్దతు ఉందని చెపుతున్నా, ఐసిసి ఒక న్యాయ వ్యవస్థగా రోమ్ స్టాచ్యూట్కు కట్టుబడి, స్వతంత్రంగా, నిష్పాక్షికంగా పని చేస్తుందని ప్రకటిస్తున్నా, లక్ష్య సాధనకు బహుదూరంలో ఉంది. అమెరికా ఆంక్షల నీడలు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసిసి) మీద కూడా పడడం, సభ్య దేశాల సహకార లోపం తదితర కారణాలతో ఆశించిన ఫలితం రావడం లేదు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ఉపాసన, ఉపవాసాలకు ఉద్దిష్ట మైనది దక్షిణాయణం

మన పూర్వికులు సూర్య భగవానుని గమనం ప్రకారం యుగాలుగానూ, యుగాలను సంవత్సరములుగానూ, సంవత్సరములను మాసములు గానూ, మాసములను వారములు గానూ, వారములను రోజులు గానూ, రోజులను జాములు గానూ, జాములను ఘడియలు గానూ కాల గమనాన్ని తెలుసు కోవటానికి విభజించారు. సంవత్సరంలో ఉన్న 12 మాసములను రెండు ఆయనాలుగా విభజించారు. సూర్య భగవానుడు మకర రాశిలో ప్రవేశించినప్పుడు ఉత్తరాయణం, కర్కాటక రాశిలో ప్రవేశించినప్పుడు దక్షిణాయణం ఏర్పడతాయి. ఖగోళ శాస్త్రం ప్రకారం జనవరి 15 నుంచి జూలై 16 వరకు ఉత్తరాయణం, జూలై 17 నుంచి జనవరి 14 వరకు దక్షిణాయనం అని అంటారు. సాయన ఉత్తరాయణం ప్రతి సంవత్సరం డిశంబర్ 21–22 తేదీల్లో ప్రారంభం అవుతుంది. అలాగే సాయన దక్షిణాయణం జూన్ 21–22 తేదీల్లో ప్రారంభం అవుతుంది. అయితే భారతీయ గ్రహగణితం నిర్ణయ గణితం కాబట్టి ఆయనాంశ కారణంగా సాయన, నిర్ణయ సంక్రాంతుల్లో ఇలా మార్పు కననిపిస్తుంది. ఖగోళ శాస్త్రం ప్రకారం.. సూర్యుడి గమనంలో మార్పులే ఉత్తరాయణ, దక్షిణాయనాలు. 'అయనం' అంటే ప్రయాణం అని అర్థం. దక్షిణాయనం అంటే దక్షిణ దిశగా ప్రయాణం చేయడమనే అర్థం వస్తుంది. సూర్యుడు తూర్పు దిశలో ఉదయిస్తాడని తెలుసు. కానీ సూర్యోదయాన్ని గమనిస్తే, అది తూర్పు దిక్కున జరగదు. సూర్యుడు సరిగ్గా తూర్పు దిశ మధ్యలో ఉదయించేది ఏడాదిలో 2 రోజులు మాత్రమే. అవి మార్చి 21, సెప్టెంబరు 23. మిగతా ఆరు నెలలు ఈశాన్యానికి దగ్గరగా, మరో 6 నెలల ఆగ్నేయానికి దగ్గరగా సూర్యోదయం జరుగుతుంది. సూర్యుడు ఈశాన్యానికి దగ్గరగా ఉదయించే కాలాన్ని ఉత్తరాయణం అని, ఆగ్నేయానికి దగ్గరగా ఉదయించే కాలాన్ని దక్షిణాయణం అని అంటారు. ఈ దక్షిణాయనంలో సూర్యుడు భూమధ్య రేఖకు దక్షిణ దిశలో పయనిస్తాడు. సూర్య గమణాన్ని బట్టి మన భారతీయులు కాలాన్ని రెండు భాగాలుగా విభజించారు . భూమధ్యరేఖకు ఉత్తరదిశలో సూర్యుడు కనిపిస్తే ఉత్తరాయణమని, దక్షిణంగా సంచరించినప్పుడు దక్షిణాయమని అన్నారు. ఏడాదిలో 6నెలలు ఉత్తరాయణం.. 6నెలలు దక్షిణాయనం. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించి నప్పుడు ఉత్తరాయణం.. కర్కాటక రాశిలోకి ప్రవేశించి నప్పుడు దక్షిణాయనం ప్రారంభమవుతుంది. సంక్రమణం ప్రవేశించిన తరువాత మొదటి 6గంటల 49 నిముషములు పుణ్యకాలంగా, 2 గంటల 16 నిమిషములు అత్యంత పుణ్యకాలంగా శాస్త్రములందు చెప్పబడింది. ఆ సమయంలో స్నాన, దాన, జపాదులేవైనా అధిక ఫలితాలనిస్తాయి. ఆధ్యాత్మిక పరంగా ఉత్తరాయణం దేవతలకు పగలు అయితే, దక్షిణాయనం దేవతలకు రాత్రి కాలం. ఈ కాలంలో శ్రీమహావిష్ణువు యోగనిద్రలో ఉంటాడు. ఇలాంటి సమయంలో మనిషి ఎదుగుదలకు దైవశక్తి సాయం ఎంతో అవసరం. అందుకే దేవతల శక్తిని ప్రేరేపించడనికి ఈ కాలంలో ఉపాసనలు చేస్తారు. అందువల్ల ఇది ఉపాసన కాలం అయ్యింది. శ్రీహరి ఆషాడ శుద్ధ ఏకాదశి రోజున యోగ నిద్రలోకి వెళ్లి కార్తీక శుద్ధ ఏకాదశి నాడు నిద్రలేస్తారు. ఈ సమయంలో యోగులు, మఠాధిపతులు చాతుర్మాస దీక్షను చేపడతారు. శాస్త్రీయంగా దక్షిణాయనంలో సూర్యకాంతి భూమి మీద తక్కువగా ప్రసరిస్తుంది. ఫలితంగా జీవులలో రోగ నిరోధకశక్తి క్షీణించి రోగాల బారిన పడతారు. వీటిని నిరోధించడానికి ఈ కాలంలో బ్రహ్మచర్యం, ఉపసాన, తరుచుగా ఉపవాసాలు, పూజలు, వ్రతాల పేరుతో పాటించే నియమాలు రోగనిరోధక శక్తిని పెంచి, ఆరోగ్యాన్ని కలిగిస్తాయి. ఎలా చూసిన దక్షిణాయనంలో చేసే జప, దాన, పూజలు ఆరోగ్యాన్ని, అధ్యాత్మిక అనుభూతుని ప్రసాదించడంతో పాటు పరమాత్మ పాదాలను చేరుస్తాయి. దక్షిణాయనంలో పిండ ప్రదానాలు, పిత్రు తర్పణాలు



చేయడం, సాత్వికాహారం ఫలితాన్నిస్తాయి. ముఖ్యంగా దక్షిణాయనం లోనె పితృ దేవతలు తమ సంతానం ఇచ్చే శ్రాద్ధాలు, విశేష తర్పణాలను స్వీకరించేందుకు భూమిపైకి వస్తారని అంటారు. ఈ సమయంలోనే పితృదేవతారాధనకు సంబంధించిన మహాలయ పక్షాలు వస్తాయి. పితృదేవతలను సంతృప్తిపరిస్తే, వారి అను గ్రహంతో సంతానాభివృద్ధి జరుగుతుంది. శ్రాద్ధాదులు నిర్వహించక పోవడం కూడా సంతాన లేమికి ఒక కారణమని పెద్దలు పేర్కొంటారు. బతికుండగా తల్లిదండ్రుల సేవ, మరణించాక శ్రాద్ధాలు చేయడం విధి, ఎంతో ముఖ్యం, శుభప్రదం. పితృ రుణం తీర్చుకోవడానికి అది మార్గం. అంతేకాదు కని పెంచిన తల్లిదండ్రులకు అది ఒక కృతజ్ఞతా పూర్వక చర్య. ధ్యానం, మంత్ర జపాలు, సూర్యోదయానికి ముందే లేచి పవిత్ర నదుల్లో స్నానాలు, పిండ ప్రదానాలు, పితృ తర్పణాలు, సాత్వికాహారం (శాకాహారం) తీసుకోవడం, అవసరంలో ఉన్న వారికి దానం చేయడం, అన్నదానం, తిల (నువ్వుల ) దానం, వస్త్ర దానం, విష్ణు పూజ, విష్ణు సహస్రనామ పారాయణ, సూర్యారాధన, ఆదిత్య హృదయ పారాయణం చేస్తే అవి శరీరానికి, మనసుకు మేలు చేస్తాయని, పాపాలు తొలగి పోతాయని శాస్త్రాలు తెలుపుతున్నాయి. ఈ ఏడు జూలై 16న దక్షిణాయనం ప్రారంభం అయింది.

# టీమిండియా యువ పేసర్‌కు బిగ్‌షాక్



## భారీ జరిమానా విధించిన ఐసీసీ

**బర్మింగ్‌హామ్, జూలై 16 :** టీమ్‌ఇండియా యువ పేసర్ గుర్నూర్ బ్రార్ ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే మ్యాచ్‌లో ఐసీసీ కోడ్ ఆఫ్ కాండక్ట్ నిబంధనలను ఉల్లంఘించినందుకు గానూ జరిమానాకు గురయ్యాడు. బర్మింగ్‌హామ్‌లో ఆతిథ్య ఇంగ్లాండ్ జట్టుతో జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. మ్యాచ్ జరుగుతున్న సమయంలో గుర్నూర్ బ్రార్ ప్రమాదకర రీతిలో బౌలింగ్ చేశాడనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ జరిపిన అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ), అతడి ప్రవర్తన సరిగ్గా లేదని నిర్ధారించింది. ఐసీసీ నిబంధనావళిలోని లెవెల్-1 నిబంధనలను ఉల్లంఘించినందుకు గానూ గుర్నూర్ మ్యాచ్ ఫీజులో కొంత శాతాన్ని జరిమానాగా విధించడంతో పాటు, అతడి ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్‌ను కూడా చేర్చింది. మ్యాచ్ ఆఖరి ఓవర్లలో తీవ్ర ఉత్కంఠ నెలకొన్న సమయంలో గుర్నూర్ బ్రార్ వేసిన ఒక డెలివరీ ఇంగ్లాండ్ బ్యాటర్‌కు ప్రమాదకరంగా దూసుకెళ్లింది. బ్యాటర్ రక్షణను ప్రమాదంలో పడేసేలా, క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా ఆ బంతిని సంధించినట్లు ఫీల్డ్ అంపైర్లు గుర్తించారు. మ్యాచ్ ముగిసిన తర్వాత అంపైర్లు ఈ విషయాన్ని మ్యాచ్ రెఫరీ దృష్టికి తీసుకెళ్లారు. ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.9 ప్రకారం.. వికెట్ల మధ్య పరిగెడుతున్న లేదా క్రీజులో ఉన్న ఆటగాళ్లపైకి ప్రమాదకరంగా బంతిని విసరడం లేదా దూకుడుగా ప్రవర్తించడం నేరం కిందకు వస్తుంది. గుర్నూర్ తన తప్పును అంగీకరించడంతో ఎలాంటి అధికారిక విచారణ అవసరం లేకుండానే మ్యాచ్ రెఫరీ ఈ శిక్షను ఖరారు చేశారు. ఒక ఏడాది కాలంలో ఆటగాళ్లకు వచ్చే డీమెరిట్ పాయింట్లు వారి భవిష్యత్తు మ్యాచ్‌లపై ప్రభావం చూపుతాయి. 24 నెలల వ్యవధిలో ఒక ఆటగాడు నాలుగు లేదా అంతకంటే ఎక్కువ డీమెరిట్ పాయింట్లు సాధిస్తే, వారు నిషేధాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. గుర్నూర్ బ్రార్ లాంటి యువ ఆటగాళ్లకు ఇటువంటి క్రమశిక్షణా చర్యలు కెరీర్ ఆరంభంలోనే ఒక హెచ్చరికగా మారుతాయి. మైదానంలో దూకుడు ప్రదర్శించడం మంచిదే అయినప్పటికీ, అది ఐసీసీ నిర్దేశించిన హద్దులను దాటకూడదని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భారత జట్టు మేనేజ్‌మెంట్ కూడా భవిష్యత్తు మ్యాచ్‌లలో మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, భావోద్వేగాలను నియంత్రించుకుంటూ బౌలింగ్ చేయాలని గుర్నూర్‌కు సూచించింది. ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న టీమ్‌ఇండియాకు ఈ పరిణామం కాస్త ఇబ్బందికరంగా మారినప్పటికీ, తదుపరి మ్యాచ్‌ల్లో గుర్నూర్ బ్రార్ పుంజుకుంటాడని అభిమానులు ఆశిస్తున్నారు.




# రోహిత్ శర్మపై వేటు

## జట్టులోకి యువరాజ్ సింగ్, సచిన్

**ఢిల్లీ, జూలై 16 :** మాజీ వికెట్ కీపర్-బ్యాటర్ రాబిన్ ఉతప్ప ఇన్‌స్టాగ్రామ్‌లో నిర్వహించిన 'దిస్ ఆర్ దట్' ఛాలెంజ్ ద్వారా తన భారత వన్డే ఎలెవెన్ జట్టును ప్రకటించారు. ఈ జట్టులో రోహిత్ శర్మ, హర్భజన్ సింగ్ వంటి దిగ్గజాలకు చోటు దక్కకపోవడం గమనార్హం. రోహిత్ శర్మ, సునీల్ గవాస్కర్‌లను పక్కనపెట్టి సచిన్ టెండూల్కర్, సౌరవ్ గంగూలీలను ఓపెనర్లుగా ఉతప్ప ఎంచుకున్నారు. మిడిలార్డర్‌లో 2011 ప్రపంచకప్ విజేత జట్టు సభ్యులైన విరాట్ కోహ్లీ, యువరాజ్ సింగ్, ఎమ్మెస్ ధోని, సురేష్ రైనాలకు అవకాశం ఇచ్చారు. రాహుల్ ద్రవిడ్, మహ్మద్ అజారుద్దీన్, అజయ్ జడేజాల కంటే వీరికే ప్రాధాన్యతనిచ్చారు. ఈ ఛాలెంజ్‌లో ధోనిని మరెవరితోనూ పోల్చకుండా నేరుగా ఎంపిక చేయడం విశేషం. భారత 1983 ప్రపంచకప్ కెప్టెన్ కపిల్ దేవ్, రవీంద్ర జడేజాలను ఆల్‌రౌండర్లుగా ఎంపిక చేశారు. హార్దిక్ పాండ్యా, రవిచంద్రన్ అశ్విన్‌లకు ఇందులో చోటు దక్కలేదు. ఇక స్పిన్ విభాగంలో వన్డేల్లో భారతదేశం తరఫున అత్యధిక వికెట్లు (334) తీసిన అనిల్ కుంబ్లేకు మొగ్గు చూపారు. హర్భజన్ సింగ్‌ను (265 వికెట్లు) పక్కన పెట్టారు. ఫాస్ట్ బౌలర్లుగా జహీర్ ఖాన్, జస్ప్రీత్ బుమ్రాలను ఎంచుకున్నారు. ఈ జట్టులో ప్రస్తుతం ఆడుతున్న ఆటగాళ్లు ముగ్గురు మాత్రమే ఉన్నారు. వారు విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా, జస్ప్రీత్ బుమ్రా. వన్డేల్లో 54 శతకాలతో అత్యధిక సెంచరీలు చేసిన ఏకైక ఆటగాడిగా ఉన్న విరాట్ కోహ్లీ (14,802 పరుగులు), సచిన్ టెండూల్కర్ (18,426 పరుగులు) తర్వాత భారత్ తరఫున రెండో అత్యధిక రన్-స్కోరర్‌గా ఉన్నారు.

### రాబిన్ ఉతప్ప వన్డే జట్టు

సచిన్ టెండూల్కర్, సౌరవ్ గంగూలీ, విరాట్ కోహ్లీ, యువరాజ్ సింగ్, ఎమ్మెస్ ధోని (కెప్టెన్), సురేష్ రైనా, కపిల్ దేవ్, రవీంద్ర జడేజా, అనిల్ కుంబ్లే, జహీర్ ఖాన్, జస్ప్రీత్ బుమ్రా.

# 2027 ప్రపంచకప్‌కు కొత్త ఫార్మాట్

## భారత్-పాక్‌కు మూడుసార్లు తలపడే అవకాశం



**దుబాయ్, జూలై 16 :** అంతర్జాతీయ క్రికెట్ మండలి 2027 పురుషుల వన్డే ప్రపంచకప్ ఫార్మాట్‌లో కీలక మార్పులకు ఆమోదం తెలిపింది. కొత్త విధానంతో టోర్నీ మరింత ఉత్కంఠభరితంగా సాగడంతో పాటు, చిరకాల ప్రత్యర్థులైన భారత్, పాకిస్థాన్ జట్లు ఒకే ప్రపంచకప్‌లో గరిష్ఠంగా మూడుసార్లు తలపడే అవకాశాన్ని కల్పించింది. ఈ మార్పులు పోటీతత్వాన్ని పెంచడమే కాకుండా వాణిజ్యపరంగానూ టోర్నీకి మరింత ఆకర్షణ తీసుకురానున్నాయని ఐసీసీ భావిస్తోంది. 2027 ప్రపంచకప్‌కు మొత్తం 14 జట్లు అర్హత సాధించినప్పటికీ, ప్రధాన టోర్నీని 12 జట్లతో నిర్వహించనున్నారు. దిగువ స్థానాల్లో నిలిచిన మూడు జట్ల మధ్య ముందుగా ప్రిలిమినరీ దశ నిర్వహించి, అందులో విజేతగా నిలిచిన జట్టుకు ప్రధాన టోర్నీలో చోటు కల్పిస్తారు. అనంతరం 12 జట్లను ఆరు చొప్పున రెండు గ్రూపులుగా విభజించి లీగ్ దశ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. లీగ్ దశ అనంతరం ఇప్పటి వరకు అమల్లో ఉన్న 'సూపర్ సిక్స్' విధానానికి బదులుగా 'సూపర్ సెవెన్' దశను ప్రవేశపెట్టారు. రెండు గ్రూపుల నుంచి అత్యుత్తమ ప్రదర్శన చేసిన ఏడు జట్లు ఈ దశకు అర్హత సాధిస్తాయి. ఇక్కడ జట్లు పరస్పరం రౌండ్ రాబిన్ పద్ధతిలో తలపడతాయి. ఈ దశ ముగిసిన తర్వాత క్వార్టర్ ఫైనల్స్ లేకుండానే నేరుగా సెమీ ఫైనల్స్, అనంతరం ఫైనల్ నిర్వహించనున్నారు. కొత్త ఫార్మాట్‌తో భారత్, పాకిస్థాన్ జట్లు ఒకే టోర్నీలో మూడు సార్లు తలపడే అవకాశాలు పెరిగాయి. గ్రూప్ దశలో ఒకసారి, సూపర్ సెవెన్‌లో మరోసారి, అనంతరం సెమీ ఫైనల్ లేదా ఫైనల్‌లో మరోసారి ఈ రెండు జట్లు ఎదురుపడే అవకాశం ఉంటుంది. ద్వైపాక్షిక సిరీస్‌లు నిలిచిపోయిన ప్రస్తుత పరిస్థితుల్లో ఐసీసీ టోర్నీల్లోనే ఈ రెండు దేశాలు తలపడుతున్న నేపథ్యంలో ఈ మార్పు అభిమానుల్లో మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. భారత్--పాకిస్థాన్ మ్యాచ్‌లకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆదరణ దృష్ట్యా ప్రసార హక్కులు, ప్రకటనల ఆదాయం కూడా గణనీయంగా పెరిగే అవకాశముందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇదే సమావేశంలో 2028 టీ20 ప్రపంచకప్ ఫార్మాట్‌లోనూ ఐసీసీ మార్పులకు ఆమోదం తెలిపింది. ఈ టోర్నీ 20 జట్లతోనే కొనసాగనున్నప్పటికీ, గ్రూప్ దశ అనంతరం ఎనిమిది జట్లకు బదులుగా పది జట్లు 'సూపర్ 10' దశకు అర్హత సాధిస్తాయి. అక్కడ అత్యుత్తమ ప్రదర్శన చేసిన రెండు జట్లు నేరుగా సెమీ ఫైనల్స్‌కు చేరుకోగా, మిగిలిన రెండు సెమీ ఫైనల్ బెర్తుల కోసం కొత్తగా 'ఎలిమినేటర్' దశను నిర్వహించనున్నారు. ఈ మార్పులతో రెండు ప్రపంచకప్‌లూ మరింత పోటీతత్వంతో సాగనున్నాయని ఐసీసీ పేర్కొంది.

# కోహ్లీ విజయానికి ఆత్మవిశ్వాసమే బలమన్న అభిషేక్ నాయర్

**ముంబై, జూలై 16 :** భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ విజయాల వెనుక ఉన్న ప్రధాన రహస్యం తన ఆటతీరుపై అతడికి ఉన్న అచంచలమైన నమ్మకమేనని భారత మాజీ సహాయక కోచ్ అభిషేక్ నాయర్ వెల్లడించాడు. కఠిన పరిస్థితుల్లో కూడా తన పద్ధతులను మార్చకుండా ముందుకు సాగే కోహ్లీ మానసిక ధైర్యమే అతడిని ప్రపంచంలోని అత్యుత్తమ క్రికెటర్లలో ఒకరిగా నిలబెట్టిందని ప్రశంసించాడు. ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా కోహ్లీతో జరిగిన ఆసక్తికర సంభాషణను నాయర్ గుర్తు చేసుకున్నాడు. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో కోహ్లీ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో డకౌట్ కావడంతో అతడిపై విమర్శలు వెల్లువెత్తిన సమయంలో కూడా కోహ్లీ ఏమాత్రం ఆందోళన చెందలేదని నాయర్ తెలిపాడు. ఆ సమయంలో తాను కోహ్లీకి ఫోన్ చేసి పరిస్థితి గురించి మాట్లాడగా, "అంతా బాగానే ఉంది. ఇదంతా ఆటలో భాగమే" అని ఎంతో ప్రశాంతంగా సమాధానం ఇచ్చాడని వెల్లడించాడు. ఆ సమాధానం కోహ్లీ మానసిక స్థైర్యానికి నిదర్శనమని పేర్కొన్నాడు. తాను గమనించిన ఒక సాంకేతిక అంశంపై సూచన ఇవ్వాలని కోహ్లీని అడిగినప్పుడు, "నేను నా పద్ధతిలోనే కొనసాగుతాను" అని సున్నితంగా తిరస్కరించాడని నాయర్ చెప్పాడు. ఆ తర్వాత జరిగిన మ్యాచ్ అనంతరం కూడా కోహ్లీ తన ఆటతీరుపై నమ్మకం ఉంచి విజయం సాధించిన విషయాన్ని గుర్తుచేసుకుంటూ, తన నిర్ణయంపై కోహ్లీకి ఉన్న విశ్వాసం తనను ఎంతో ఆకట్టుకుందని వివరించాడు. ఈ ఒక్క సంఘటన గొప్ప ఆటగాళ్ల మానసిక బలాన్ని స్పష్టంగా చూపిస్తుందని నాయర్ అభిప్రాయపడ్డాడు. క్లిష్ట పరిస్థితుల్లో ఎలా స్పందించాలో, ఎలా తిరిగి ఫామ్‌లోకి రావాలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి ఆటగాళ్లకు బాగా తెలుసని అన్నాడు. విశ్లేషకులు ఎన్నో సూచనలు చేసినా, అంతర్జాతీయ స్థాయిలో నిరంతరం విజయాలు సాధించేది ఆటగాళ్ల ఆత్మవిశ్వాసమేనని పేర్కొన్నాడు. అందుకే కోహ్లీ, రోహిత్‌లాంటి క్రికెటర్లపై తనకు అపారమైన గౌరవం ఉందని, తమపై తాము పెట్టుకున్న నమ్మకమే వారిని ఇతరుల కంటే ప్రత్యేకంగా నిలబెట్టిందని అభిషేక్ నాయర్ వెల్లడించాడు.



# అర్జెంటీనా ఆటగాళ్ల బ్యానర్‌పై వివాదం

**అట్లాంటా, జూలై 16 :** ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీలో ఇంగ్లండ్‌పై సెమీఫైనల్ విజయం అనంతరం అర్జెంటీనా ఆటగాళ్లు ప్రదర్శించిన బ్యానర్ వివాదానికి దారి తీసింది. మ్యాచ్ ముగిసిన తర్వాత మైదానంలో సంబరాలు జరుపుకున్న ఆటగాళ్లు ఫాక్‌ల్యాండ్స్ దీవులకు సంబంధించిన సందేశంతో కూడిన బ్యానర్‌ను ప్రదర్శించారు. అందులో 'లాస్ మాల్వినాస్ అర్జెంటీనావే' అనే భావం వ్యక్తమయ్యే నినాదం ఉండటంతో రాజకీయ వివాదం చెలరేగింది. ఫాక్‌ల్యాండ్స్ దీవులపై బ్రిటన్, అర్జెంటీనా మధ్య చాలా కాలంగా వివాదం కొనసాగుతోంది. అట్లాంటిక్ మహాసముద్రంలో ఉన్న ఈ దీవులు ప్రస్తుతం బ్రిటన్ ఆధీనంలో ఉన్నప్పటికీ, అవి తమ భూభాగమేనని అర్జెంటీనా వాదిస్తోంది. ఈ నేపథ్యంలో ఆటగాళ్లు ప్రదర్శించిన బ్యానర్ క్రీడా వేదికపై రాజకీయ సంకేతాలను ప్రోత్సహించినట్లుగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వివాదానికి చారిత్రక నేపథ్యం కూడా ఉంది. 1982లో ఫాక్‌ల్యాండ్స్ దీవుల అంశంపై బ్రిటన్, అర్జెంటీనా మధ్య యుద్ధం జరిగి వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. గతంలో 2014లో కూడా అర్జెంటీనా ఆటగాళ్లు ఇలాంటి వివాదాస్పద బ్యానర్‌ను ప్రదర్శించగా, అప్పట్లో జట్టుపై భారీ జరిమానా విధించారు. తాజా ఘటనపై ఫిఫా అధికారులు దర్యాప్తు ప్రారంభించనున్నట్లు సమాచారం. పోటీ నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ సందేశాలను ప్రదర్శించారనే ఆరోపణలపై విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకునే అవకాశముందని క్రీడా వర్గాలు పేర్కొంటున్నాయి.



# ప్రేక్షకుల ప్రేమే నా బలం: కిరణ్ అబ్బవరం



**హైదరాబాద్, జూలై 1 6 :** గత ఐదారు సంవత్సరాలుగా ప్రేక్షకుల నుంచి అపారమైన ప్రేమాభిమానాలు అందుకున్నానని, మంచి చిత్రాలతో వారి ఆదరణను మరింతగా పొందేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని యువ కథానాయకుడు కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న లిచెన్నై ప్రేమకథ' ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. తన జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ చిత్రంలో స్వచ్ఛమైన ప్రేమకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. ఒక యువతి కోసం ఎంత గొప్పగా ప్రేమించవచ్చో ఈ కథలో చూపించామని, ప్రేమతో పాటు ప్రేక్షకులను అలరించే మాస్ అంశాలు కూడా చిత్రంలో ఉన్నాయని తెలిపారు. ప్రతి వర్గం ప్రేక్షకులను ఆకట్టుకునేలా చిత్రాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. నిర్మాత ఎస్.కే.ఎన్. మాట్లాడుతూ, ఈ చిత్రం ప్రేక్షకుల హృదయాలను తాకే ప్రేమకథగా నిలుస్తుందని చెప్పారు. దర్శకుడు రవి నంబూరి మాట్లాడుతూ, ప్రధాన పాత్రల భావోద్వేగాలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటాయని తెలిపారు. ఈ చిత్రంలో శ్రీగౌరి ప్రియ కథానాయికగా నటించగా, సంగీతాన్ని మణిశర్మ సమకూర్చారు.

# 'ఆపరేషన్ అరుణారెడ్డి'పై పోసాని ధీమా



**హైదరాబాద్, జూలై 16 :** పోసాని కృష్ణమురళి ప్రధాన పాత్రలో నటిస్తూ స్వీయ నిర్మాణం, దర్శకత్వంలో తెరకెక్కించిన 'ఆపరేషన్ అరుణారెడ్డి' చిత్రం ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన విడుదలకు ముందరి కార్యక్రమంలో పోసాని మాట్లాడుతూ ఈ చిత్రం తన సినీ జీవితంలో అత్యుత్తమ కథనంతో రూపొందిన చిత్రమని అన్నారు. సినిమా ప్రారంభం నుంచి చివరి వరకు కథ ఏ మలుపు తిరుగుతుందో ప్రేక్షకులు ఊహించలేరని, ప్రతి సన్నివేశం ఆసక్తికరంగా సాగుతుందని తెలిపారు. కుటుంబ సమేతంగా చూసే విధంగా ఎక్కడా అసభ్యతకు తావు లేకుండా చిత్రాన్ని తెరకెక్కించామని చెప్పారు. ఈ చిత్రంలో హిందోళ చక్రవర్తి, కాజల్ శర్మ, అయేషా ఖాన్ తదితరులు కీలక పాత్రలు పోషించగా, మహదేవ్ ఏలెందర్ సంగీతం సమకూర్చారు.

# నా ఫొటోలు తీయకండి ప్లీజ్

బాలీవుడ్ నటి మౌనీరాయ్ ఇటీవల ముంబయిలో ఫొటోగ్రాఫర్లపై అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. రెస్టారెంట్ నుంచి బయటకు వచ్చి కారు ఎక్కిన తర్వాత కూడా ఆమెను కారు అద్దంలో నుంచి కెమెరామెన్‌లు క్లిక్ చేశారు. దీంతో మౌనీరాయ్ వాళ్లను వారించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు విమర్శలు కురిపించారు. దీనిపై తాజాగా ఆమె వివరణ ఇస్తూ పోస్ట్ పెట్టారు. 'నాకు ఫొటోగ్రాఫర్లంటే చాలా గౌరవం ఉంది. కానీ, దయచేసి నన్ను ఫొటోలు తీయకండి. నేను చాలా రోజుల నుంచి మిమ్మల్ని పిలవడం లేదు. ఇకపై కూడా పిలవను. నాకోసం ఎప్పుడూ రాకండి. మీపై గౌరవంతోనే ఈ మాటలు చెబుతున్నా' అని నటి పేర్కొన్నారు. అయితే, కొద్దిసేపటికే ఆమె ఈ పోస్ట్‌ను డిలీట్ చేసినప్పటికీ.. ఆ స్క్రీన్‌షాట్‌లు వైరల్ అయ్యాయి. కొందరు ఆమెను ట్రోల్ చేస్తుండగా.. సెలబ్రిటీలకు కూడా వ్యక్తిగత గోప్యత ఉంటుందని మరికొందరు నెటిజన్లు నటికి మద్దతుగా నిలుస్తున్నారు. ప్రస్తుతం మౌనీ రాయ్ 'విశ్వంభర'లో ఓ ప్రత్యేకపాటతో అలరించనున్నారు. ఇందులో చిరు సరసన స్పెషల్ సాంగ్ చేశారు. దీంతో పాటు భండార్కర్ దర్శకత్వంలో రాబోతున్న 'ది వైవ్స్' చిత్రంలో నటిస్తున్నారు.







# రజనీకాంత్ చిత్రంలో రుక్మిణికి చాన్స్

**చెన్నై, జూలై 16 :** కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు వరుసగా భారీ చిత్రాల్లో అవకాశాలు దక్కుతున్నాయి. ఇప్పటికే యశ్ నటిస్తున్న 'టాక్సిక్', ఎన్టీఆర్ నటిస్తున్న లి'డ్రాగన్' చిత్రాల్లో కథానాయికగా నటిస్తున్న ఆమెకు తాజాగా రజనీకాంత్ కథానాయకుడిగా రూపొందనున్న 'ధర్మన్ – ది డెడ్లీ డాక్టర్' చిత్రంలోనూ కీలక పాత్ర లభించినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రంలో రుక్మిణి పాత్ర కథలో ఎంతో ప్రాధాన్యంతో సాగుతుందని సమాచారం. సిమ్రాన్ కథానాయికగా నటిస్తుండగా, రాశీ ఖన్నా మరో కీలక పాత్రలో కనిపించనున్నారు. దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ చిత్రాన్ని తెరకెక్కించనుండగా, త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఈ చిత్ర నిర్మాణ బాధ్యతలను ప్రముఖ నటుడు కమల్ హాసన్ చేపట్టగా, సంగీతాన్ని అనిరుధ్ రవిచందర్ సమకూరుస్తున్నారు. వరుసగా ప్రతిష్ఠాత్మక చిత్రాల్లో అవకాశాలు దక్కించుకుంటున్న రుక్మిణి వసంత్ ప్రస్తుతం దక్షిణ భారత చిత్రసీమలో అత్యంత బిజీ కథానాయికలలో ఒకరిగా నిలుస్తున్నారు.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com